www.vishalabharati.com
epaper:vishalabharati.com

బుధవారం, హైదరాబాద్
13 సెప్టెంబర్ 2023
సంపుటి:1 సంచిక:341

విశాల భారతి
తెలుగు దినపత్రిక

## షాతో కేటీఆర్ అగ్రిమెంట్



- ఆ తర్వాతే కవిత కేసు వీక్
- ఉద్యమ సమయంలో కేటీఆర్ ఎక్కడ?
- దళితులకు మూడెకరాలు ఎప్పుడిస్తారు?
- కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

..మిగతా | 2 | లో

# షెడ్యూల్ ప్రకారం ఎన్నికల నోటిఫికేషన్ రాకపోవచ్చు



మరో 6 నెలల తర్వాతే ఎన్నికలు ఉండొచ్చు

ప్రగతి భవన్‌లో విలేకరులతో కేటీఆర్ చిట్‌చాట్

జమిలి ఎన్నికలు వచ్చినా ఆరు నెలల పాటు మా ప్రభుత్వమే ఆపద్ధర్మ ప్రభుత్వం

**-హైదరాబాద్,విశాలభారతి:**

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు అక్టోబరు నెలలో నోటిఫికేషన్ రాకపోవచ్చని తెలంగాణ మంత్రి కేటీఆర్ అభిప్రాయపడ్డారు. మరో 6 నెలల తర్వాతే ఎన్నికలు ఉండొచ్చని అంచనా వేశారు. ప్రగతి భవన్‌లో ఆయన విలేకరులతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికలకు సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల తర్వాతే దీనిపై స్పష్టత రావొచ్చన్నారు. ఒక వేళ జమిలి ఎన్నికలు వచ్చినా.. ఆరు నెలల పాటు తమ ప్రభుత్వమే ఆపద్ధర్మ ప్రభుత్వంగా ఉంటుంది కాబట్టి.. మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు.'జమిలి ఎన్నికలు ఉన్నా, లేకపోయినా మాకే లాభం. ఇటీవల అభ్యర్థులను ప్రకటించిన తర్వాత మరింత సానుకూలత వ్యక్తమవుతోంది. కచ్చితంగా 90కిపైగా స్థానాల్లో భారాస విజయం సాధించి.. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు' అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ ఆదరణ కోల్పోయిందన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై గానీ, ఇతర నేతలపై గానీ ప్రజలకు ఏమాత్రం నమ్మకం లేదని చెప్పారు. 'జాతీయ పార్టీలు ఢిల్లీ బానిసలు. ఆత్మగౌరవమున్న తెలంగాణ ప్రజలు బానిసత్వ పార్టీలను అంగీకరించరు. ఢిల్లీ బానిసలు కావాలో, తెలంగాణ బిడ్డ కావాలో రాష్ట్ర ప్రజలు తేల్చుకోవాలి. కిరణ్‌కుమార్‌రెడ్డి, కేవీపీ, షర్మిల లాంటి తెలంగాణ వ్యతిరేకులంతా ఏకమవుతున్నారు. పదేళ్ల అభివృద్ధిని తెలంగాణ వ్యతిరేకుల చేతుల్లో పెడదామా? ప్రజలే తెలుసుకోవాలి' అని కేటీఆర్ అన్నారు.

కిందిస్థాయి నుంచి వస్తున్న ఫీడ్‌బ్యాక్ ప్రకారం కేసీఆర్ ఈ రాష్ట్రానికి అవసరమని ప్రజలు భావిస్తున్నారని కేటీఆర్ తెలిపారు. 'పది సంవత్సరాల్లో ప్రభుత్వం అందించిన పథకాలు, సంక్షేమ పనులు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలే అద్భుతంగా వివరిస్తున్నారు. ప్రజలకు చాలా స్పష్టత ఉంది. ప్రతిపక్షాలే అయోమయంలో ఉన్నాయి. కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీనే తెలంగాణకు శ్రీరామరక్ష. ప్రతిపక్షాల తాపత్రయం రెండో స్థానం కోసమే. సిట్టింగ్‌లకు సీట్లు ఇవ్వకపోతే.. మా దగ్గరికి వస్తారని ప్రతిపక్షాలు భావించాయి. తాను నిర్మించిన నాయకత్వం, పార్టీ నాయకులపైన తనకున్న నమ్మకం మేరకే కేసీఆర్ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ సీట్లిచ్చారు' అని కేటీఆర్ తెలిపారు.



# షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు

## డిసెంబరు మొదటి వారంలోనే అసెంబ్లీ ఎన్నికలు

చంద్రబాబు అరెస్టు గురించి నాకు అంత వరకే తెలుసు

ఈనెల 17న విమోచన దినోత్సవం పెద్ద ఎత్తున ప్రజలు హాజరుకావాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి

**హైదరాబాద్,విశాలభారతి:**

రాష్ట్రంలో ఆరు నెలలు తర్వాత ఎన్నికలు జరగవచ్చని కేటీఆర్ చేసిన సంచలన వ్యాఖ్యాలు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు కేటీఆర్ మాటల్లో నిజం లేదని.. తెలంగాణలో షెడ్యూల్ ప్రకారమే శాసనసభ ఎన్నికలు జరుగుతాయని.. అందులో ఎలాంటి సందేహం లేదని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. ఈనెల 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని.. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరుకావాలని కోరారు. రంగారెడ్డి జిల్లాలోని వనస్థలిపురంలో జరిగిన బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుల రాష్ట్రస్థాయి ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, పలువురు నేతలు పాల్గొన్నారు. "తెలంగాణలో షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయి. డిసెంబరు మొదటి వారంలో ఎన్నికలు నిర్వహిస్తారు. అందుకు తగిన ఏర్పాట్లను కూడా చేస్తున్నారు. అందుకు తగిన విధంగా తెలంగాణలో గెలుపొందెందుకు బీజేపీ కసరత్తులు చేస్తోంది. తెలంగాణ వస్తే దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పి మాట కేసీఆర్ మాట తప్పారు. ఇప్పుడు దళిత బంధు, డబుల్ బెడ్రూం ఇళ్లలో దళితులను మోసం చేస్తున్నారు." అని కిషన్ రెడ్డి అన్నారు.

నిరుద్యోగ దీక్షను ఈ నెల 13,14 తేదీల్లో ఇందిరాపార్క్ వద్ద 24 గంటలు దీక్ష చేయబోతున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక తెలంగాణ వస్తే తొలి ముఖ్యమంత్రిగా దళితుడినే అన్న కేసీఆర్.. ఆ విషయం మరచి దళితులకు తీరని మోసం

..మిగతా | 2 | లో



తెలంగాణకు మరోసారి

## అమిత్ షా

- షా సభమీదే కాషాయపార్టీ ఆశలు

..మిగతా | 2 | లో



గాంధీ విగ్రహాల ఎదుట నిరసన

## తెలపండి

- టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్

..మిగతా | 2 | లో

# సిద్దిపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- ముగ్గురు విద్యార్థుల దుర్మరణం
- ఎనిమిది మందికి గాయాలు
- హరీష్‌రావు దిగ్భ్రాంతి

సిద్దిపేట,విశాలభారతి: జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. ఆగి ఉన్న ఇసుక లారీని వెనకాల నుంచి క్వాలిస్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఈ సంఘటన చిన్నకోడూరు మండలం అనంతసాగర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది.

..మిగతా | 2 | లో





# పాపం.. చికోటి

## బీజేపీలో చేరుతానంటూ భారీ ర్యాలీ

- భారీ ర్యాలీగా నాంపల్లి ఆఫీసుకు కానీ అక్కడ నిరాశ
- బీజేపీ ముఖ్యనేతలు మిస్సింగ్ ... కమ్యూనికేషన్ గ్యాప్ వల్లేనా?

**విశాలభారతి, హైదరాబాద్:**

క్యాసినో కింగ్ చికోటి ప్రవీణ్ మంగళవారం బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్న విషయం తెలిసిందే. ఇందుకోసం భారీగా కటౌట్లు ఏర్పాటు చేశారు. పత్రికల్లో యాడ్స్ ఇచ్చుకున్నారు. మంగళవారం ఆయన భారీగా ర్యాలీగా నాంపల్లిలోని బీజేపీ స్టేట్ ఆఫీసుకు వచ్చారు. కానీ అక్కడ ఊహించని పరిణామం ఎదురైంది. ముఖ్యనేతలెవరూ కనిపించకపోవడంతో చికోటి వెనుదిరిగారు. చికోటి ప్రవీణ్ బీజేపీలో చేరడానికి బ్రేక్ పడింది.కానీ అధిష్టానం

..మిగతా | 2 | లో



# చంద్రబాబుకు మళ్లీ నిరాశే..

## హౌస్ రిమాండ్ పిటిషన్‌ను తిరస్కరణ

**విశాలభారతి, ఏపీ బ్యూరో :**

టీడీపీ అధినేత చంద్రబాబు హౌస్ రిమాండ్ పిటిషన్‌పై విజయవాడ ఏసీబీ కోర్టు తీర్పు వెలువరించింది. చంద్రబాబు తరపు న్యాయవాదులు దాఖలు చేసిన హౌస్ రిమాండ్ పిటిషన్‌ను న్యాయమూర్తి తిరస్కరించారు. ఇంటి కంటే జైలు వద్దే భద్రత ఎక్కువ అని భావిస్తున్నట్టు న్యాయమూర్తి పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌జీ ప్రొటెక్ట్ చేసే వ్యక్తిగా ఓ ఇంటి వద్ద ఆ స్థాయి భద్రత కల్పించలేమని పేర్కొంటూ హౌస్ రిమాండ్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. హౌస్ రిమాండ్ పిటిషన్‌పై పిటిషనర్ చేసిన వాదలపై సంతృప్తి చెందలేదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. రిమాండ్ రిపోర్టు లో దాఖలు చేసిన పత్రాలు ఇవ్వాలని చంద్రబాబు తరపు న్యాయవాదులు కోరారు. అరెస్టు సమయంలో కాల్ రికార్డులను భద్రపర్చాలని మరోమారు చంద్రబాబు తరపు న్యాయవాదులు కోర్టును కోరారు. పిటిషన్‌పై సోమ, మంగళవారాల్లో సుదీర్ఘ వాదనలు కొనసాగాయి. చంద్రబాబు ఆరోగ్యం బాగానే ఉందని, జైల్లో పూర్తి స్థాయి భద్రత కల్పించామని అదనపు ఏజీ న్యాయస్థానానికి తెలిపారు. జైల్లోనే కాకుండా పరిసర ప్రాంతాల్లోనూ పోలీసు భద్రత ఉన్నట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 24 గంటలూ పోలీసులు విధుల్లోనే ఉంటున్నారని, అత్యవసర పరిస్థితులు ఎదురైతే వైద్య

..మిగతా | 2 | లో

# జర్నలిస్టుల రైల్వే పాస్ పునరుద్ధరణకు కృషి చేస్తా

- ఇండ్ల స్థలాల విషయంలోనూ సర్కారు సానుకూలం
- హెచ్‌యూజే ప్రతినిధులతో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి



**విశాల భారతి, హైదరాబాద్:** జర్నలిస్టుల రైల్వేపాసుల పునరుద్ధరణకు తనవంతు కృషి చేస్తానని చేవెళ్ల ఎంపీ డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయంలోనూ, రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని వెల్లడించారు. మంగళవారం జూబ్లిహిల్స్ లోని తన నివాసంలో హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే-టీడబ్ల్యూజేఎఫ్) ప్రతినిధి బృందం ఆయన్ను కలిసింది. ఈ సందర్భంగా రైల్వే పాసులు, ఇండ్లస్థలాలతో పాటు పలు అంశాలను హెచ్‌యూజే ప్రతినిధులు ఎంపీ రంజిత్ రెడ్డి దృష్టికి తీసుకుపోయారు. మూడేండ్లుగా జర్నలిస్టులకు రాయితీ పాసులను రైల్వేశాఖ ఆపేసిందనీ, ఇప్పటికీ పాస్‌లు పునరుద్ధరించలేదనీ వివరించారు. దీనిపై స్పందించిన రంజిత్ రెడ్డి.. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర రైల్వేమంత్రి అశ్వనీ వైష్ణవ్‌తో దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. రైల్వే పాసులు పునరుద్ధరించాలంటూ ఆయనకు లేఖ కూడా రాస్తానని తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇస్తుందని చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జర్నలిస్టులకూ ఇండ్ల స్థలాల విషయంలో ప్రభుత్వానికి ఎలాంటి బేషజాలు లేవని, ఈ విషయంలో సీఎం కేసీఆర్ సానుకూలంగా ఉన్నారనీ స్పష్టం చేశారు. ఎంపీని కలిసిన వారిలో హెచ్‌యూజే ప్రెసిడెంట్ అరుణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, ట్రెజరర్ భట్టిపాటి రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్లు సాగర్ వనపర్తి, భయ్యా దామోదర్, రమేష్ తదితరులు ఉన్నారు.

టీటీడీ బోర్డు మెంబర్ సీతారంజిత్‌రెడ్డికి హెచ్ యూజే శుభాకాంక్షలు

చేవెళ్ల ఎంపీ డాక్టర్ జి. రంజిత్ రెడ్డి సతీమణి సీతారెడ్డి ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు మెంబర్ గా నియమితులైన సందర్భంగా హైదరాబాద్ జర్నలిస్టు యూనియన్ ( హెచ్‌యూజే-టీడబ్ల్యూజేఎఫ్ ) ప్రతినిధి బృందం శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా మంగళవారం ఆమె నివాసంలో హెచ్ యూజే అధ్యక్షుడు అరుణ్ కుమార్, ట్రెజరర్ బట్టిపాటి రాజేశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, వైస్ ప్రెసిడెంట్ సాగర్ వనపర్తి, దామోదర్, రమేష్‌లు కలిసి వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అటు తర్వాత ఎంపీ రంజిత్ రెడ్డి, సీతారెడ్డి దంపతులకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ప్రపంచంలోనే ప్రసిద్ధిగాంచిన టీటీడీ బోర్డుకు తెలంగాణ ప్రాంతం నుంచి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే సీతారంజిత్‌రెడ్డి ఎంపిక కావడం పట్ల హెచ్‌యూజే ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.



# షాతో కేటీఆర్ అగ్రిమెంట్

## ఆ తర్వాతే కవిత కేసు వీక్

## ఉద్యమ సమయంలో కేటీఆర్ ఎక్కడ?

## దళితులకు మూడెకరాలు ఎప్పుడిస్తారు?

## కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**విశాలభారతి, హైదరాబాద్:**

అమిత్ షాతో ఐటీ మంత్రి కేటీఆర్ ఒప్పందం కుదుర్చుకున్నారని.. ఆ తర్వాతే కవిత్ లిక్కర్ స్కామ్ కేసు వీక్ అయ్యిందని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారు. మంత్రి కేటీఆర్‌కు కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గట్టి కౌంటర్ ఇచ్చారు. ఈరోజు మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పై తీవ్ర విమర్శలు గుప్పించారు. దీంతో కేటీఆర్‌పై కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నాడు గాంధీ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్‌కు రాజకీయాలపై అనుభవం లేదు. బానిసత్వ పార్టీ ఎవరిదో తెలుస్తోంది. కేటీఆర్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాని కలిసిన తర్వాత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కేసు ఆగిపోయింది. కేటీఆర్‌కి కొంత నాలెడ్జ్ ఉందనుకున్నా. ఈరోజు చిట్ చాట్ తర్వాత కేటీఆర్‌కి ఏం తెలియదని అర్థమైంది.కేసీఆర్‌కి దమ్ముంటే ఆయనను బండ భూతులు తిట్టినా దానం నాగేందర్, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ని క్యాబినెట్ నుంచి తీసేయాలి.మీ పార్టీ నుంచి తెలంగాణ ద్రోహులను తీసేయండి.

తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ పాత్ర 1% మాత్రమే. రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ 115 మందిని ప్రకటించి ఒక్కొక్కరికీ 10 కోట్ల రూపాయల ఇచ్చి పంపారు. మేం తెలంగాణ ఉద్యమం చేసినప్పుడు కేటీఆర్ అమెరికాలో ఉన్నాడు.చంద్రబాబు మంత్రి పదవి ఇవ్వకపోవడంతోనే కేసీఆర్ బయటకి వచ్చి పార్టీ పెట్టాడు. రాజశేఖర్‌రెడ్డిని ఎదిరించి మేం తెలంగాణ కోసం కొట్లాడాం.కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక అసెంబ్లీలో మాట్లాడిన మాటల రికార్డులను కేటీఆర్ వినాలి.సోనియాగాంధీ వల్లే తెలంగాణ వచ్చిందని కేసీఆర్ అన్నారు. సోనియా పాత్ర లేదని కేటీఆర్ అంటున్నాడు. తెలంగాణ ఉద్యమం కోసం చలించి సోనియా తెలంగాణ ఇచ్చింది.సోనియా, కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం కేటీఆర్‌కి తగదు. కాంగ్రెస్ హయాంలో ఒకటో తేదీన పింఛన్లు వచ్చేవి.బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టిందో చెప్పాలి. ఎన్నికలు వస్తున్నాయనే పాలమూరు ప్రాజెక్టు ప్రారంభిస్తున్నారు. దానం నాగేందర్ కర్ర పట్టుకొని తెలంగాణ ఉద్యమకారులను కొట్టాడు. కేసీఆర్‌ని తిట్టిన తలసాని మంత్రి ఎలా అయ్యాడు?. తెలంగాణ ద్రోహులను నీ పార్టీలో పెట్టుకొని ఏం మాట్లాడుతున్నావ్ కేటీఆర్?. పార్లమెంట్‌లో కేసీఆర్ ఒక్కసారైనా తెలంగాణ కోసం మాట్లాడాడా?. క్యాబినెట్ మంత్రుల్లో చాలా మంది తెలంగాణ ఉద్యమానికి సంబంధం లేని వారే. సోనియా గాంధీ లేకుంటే తెలంగాణ రాకపోయేది.తెలంగాణ ఏర్పాటులో సోనియా పాత్ర లేకపోతే కేసీఆర్ కుటుంబం సోనియాని ఎందుకు కలిశారు? ఎందుకు గ్రూప్ ఫొటో దిగారు. కేసీఆర్‌ని తిట్టిన తెలంగాణ ద్రోహులు బీఆర్ఎస్‌లో ఉన్నారు.. వారిని సస్పెండ్ చేయాలి.తెలంగాణ హోంమంత్రి మహమూద్ అలీ, పద్మ దేవేందర్‌రెడ్డిలను కేసీఆర్ బానిసల్లాగా చూస్తున్నారు. మంత్రులకు అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం బానిసత్వం కాదా?. దట్టీలు కట్టడానికి తప్పా మహమూద్ అలీ దేనికి పనికిరాడు. కాంగ్రెస్ పార్టీలో ఎవరైనా ముఖ్యమంత్రులు అవుతారు. బీఆర్ఎస్ పార్టీలో ఇప్పుడు కేసీఆర్, తర్వాత కేటీఆర్, ఆ తర్వాత హిమాన్ష్‌రావు ముఖ్యమంత్రి అవుతారు. మా చెల్లిని అరెస్ట్ చేయకండి.. ఎన్నికలు ఎప్పుడైనా పెట్టుకోండని కేటీఆర్ అమిత్‌షాకి చెప్పి వచ్చాడు. కేసీఆర్ దళిత ముఖ్యమంత్రి, మూడు ఎకరాల డిక్లరేషన్ ఏమయింది? దళితబంధు, బీసీ బంధులో అక్రమాలపై కోర్టుకు వెళ్తున్నాను'' అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

# రాష్ట్రంలో రాజ్యాంగం అమలు కావడం లేదు

- రాజకీయ నాయకుడు కావాలంటే మెరిట్ ఉండాలి
- అధికారం వచ్చాక మొదట దళిత సీఎంగా చేస్తానన్న కేసీఆర్
- ఇప్పటి వరకు అది నిజం చేయలేదు
- బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్



**హైదరాబాద్,విశాలభారతి:** రాష్ట్రంలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగం 75 సంవత్సరాలు పూర్తయిన ఇంకా సంపూర్ణంగా అమలు కాలేదని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ఆరోపించారు. హైదరాబాద్లోని వనస్థలిపురంలో బీజేపీ ఎస్సీ మోర్చా మండల రాష్ట్ర స్థాయి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అఖండ భారతం సుభిక్షంగా ఉండడానికి అంబేద్కర్ రాజ్యాంగాన్ని అందించారని తెలిపారు. రాజకీయ నాయకుడు కావాలంటే మెరిట్ ఉండాలని.. రాజ్యాంగాన్ని అర్థం చేసుకొని అమలు చేయడమే ఆ మెరిట్ అని అన్నారు.

ఎమ్మెల్యే పదవి కొనుక్కుంటేనో, అడుక్కుంటేనో దక్కదని.. రాజ్యాంగబద్ధంగా ప్రజలు ఓటు వేస్తే వస్తుందని వివరించారు. ధనికులకి అయినా.. పేదవారికి అయినా రాజ్యాంగం ద్వారా అందరికి సమానంగా ఓటు కల్పించారని చెప్పారు. దాన్ని మంచి మార్గంలో ఉపయోగించాలని అన్నారు. తెలంగాణ అణగారిన వర్గాలకు నిలయమని పేర్కొన్నారు. అధికారం వచ్చాక మొదట దళిత సీఎంగా చేస్తానన్న ముఖ్యమంత్రి కేసీఆర్.. ఇప్పటి వరకు అది నిజం చేయలేదని మండిపడ్డారు. ఉప ముఖ్యమంత్రి పదవి కూడా ఇచ్చినట్టే ఇచ్చి అవమానకరంగా తీసివేశారని ధ్వజమెత్తారు.

"రాష్ట్రంలో పేద దళితులకు కాకుండా బీఆర్ఎస్ నాయకులకు దళితబంధు ఇచ్చుకుంటున్నారు. కేసీఆర్ మాటలతో కాలం గడుపుతున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నంత వరకు కేసీఆర్ కుటుంబానికి తప్ప మరొకరికి సీఎం పదవి దక్కదు. కుల, మతాలు తేడా లేకుండా అందరికి అధికారం పంచే పార్టీ బీజేపీ మాత్రమే. హుజూరాబాద్లో ఆత్మగౌరవం ఎలా నిలబెట్టారో తెలంగాణ అంతా నిలబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. బీజేపీ నేతలు అందరు ఐక్యంగా ఉండి.. ప్రజల్లో చైతన్యాన్ని నింపాలి." అని ఈటల రాజేందర్ అన్నారు.

రాష్ట్రంలో 52 శాతం బీసీలు ఉంటే కేవలం ముగ్గురు మాత్రమే మంత్రులు ఉన్నారని గుర్తు చేశారు. ఆ మంత్రి పదవిలు కూడా సంక్షేమ శాఖలు తప్ప రెవెన్యూ, ఫైనాన్స్, ఇండస్ట్రీలాంటి శాఖలు ఇవ్వలేదని ఆరోపించారు. తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన తరవాత కూడా ఆ పదవిని బీసీలకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 17 శాతం ఉన్న దళితులకు ఒక్క మంత్రి పదవి మాత్రమే ఇచ్చారని అన్నారు. కేవలం 0.6 శాతం ఉన్న జనాభాకు మాత్రం నాలుగు మంత్రి పదవులు ఇచ్చారని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ విషయాలను గమనిస్తే.. ఇంతకంటే ఏముంది కేసీఆర్ గురించి చెప్పడానికని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్కి ఎందకు ఓటు వేయాలని ప్రశ్నించారు.



# చంద్రబాబును అరెస్టు చేసిన విధానం సరికాదు

- భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

**హైదరాబాద్,విశాలభారతి:** తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఏపీ ప్రభుత్వం అరెస్టు చేసిన విధానం సరైందికాదని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. ఎఫ్ఐఆర్‌లో పేరు లేకుండానే ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలం పనిచేసిన వ్యక్తిని, ప్రతిపక్ష నేతను అర్ధరాత్రి అరెస్టు చేయడం ఏ మాత్రం సమంజసం కాదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబును అరెస్టు చేయడంతో తెలుగుదేశం పార్టీ పట్ల ఏపీ ప్రజల్లో సానుభూతి పెరిగిందన్నారు. అవినీతికి పాల్పడినట్టు ఆధారాలుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందేనని.. చట్టానికి ఎవరూ అతీతులు కాదన్నారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి హుజూర్ నగర్ ప్రజల భవిష్యత్తు మారుస్తా

- భారీ జన సందోహం మధ్య పిల్లుట్ల రఘు అడుగులు
- శాలువాతో సన్మానించిన దేవాలయం కమిటి
- ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలి
- పిలుట్ల రఘు



**హుజూర్ నగర్ ,విశాలభారతి:** సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గంలోని హుజూర్ నగర్ మండల కేంద్రంలో ముత్యాలమ్మ తల్లి పండుగకి హుజూర్ నగర్ నియోజకవర్గం యువ నాయకుడు ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లుట్ల రఘు హాజరై ముత్యాలమ్మ తల్లి నీ దర్శించుకోవడం జరిగింది. హుజూర్ నగర్ మహిళలు, యువత, ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి రఘు కి హారతి ఇచ్చి స్వాగతం పలికారు.బారి జన సందోహం మధ్య ఊరేగింపుగా దేవాలయానికి తీసుకు వెళ్ళి అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఒక్క అవకాశం ఇవ్వాలని పార్టీలకతీతంగా కుల మతాలకు అతీతంగా పరిపాలన చేసి హుజూర్ నగర్ నియోజకవర్గం ప్రజలందరికీ నిత్యం అందుబాటులో ఉంటూ ప్రతి ఒక్కరి సమస్య తీరుస్తానని ప్రభుత్వం తో సంబధం లేకుండా నా స్వంత నిధులతో పనులు చేసి నిరుపేద కుటుంబాలను ఆదుకుంటానని అన్నారు. నియోజకవర్గం మొత్తం ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానని మీ ముందుకు ఎమ్మెల్యే అభ్యర్థి గా రాబోతున్న అని ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, ముత్యాలమ్మ తల్లి దేవాలయం కమిటి, హుజూర్ నగర్ యువత, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# పాపం.. చికోటి

**మొదటిపేజీ తరువాయి**

నుంచి ఆదేశాలు రావడంతో చికోటి ప్రవీణ్ బీజేపీలో చేరికకు తాత్కాలికంగా వాయిదా పడింది. పార్టీ ఆఫీసులో నేతలతో చర్చలు జరుపుగుతున్నట్లు తెలుస్తోంది.కర్మాన్‌ఘాట్‌లోని హనుమాన్ టెంపుల్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి బీజేపీ ఆఫీసుకు చేరుకుని పార్టీలో చేరాల్సి ఉంది. అయితే మరికాసేపట్లో కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో చికోటి ప్రవీణ్ పార్టీలో చేరతారనగా.. ఢిల్లీ అధిష్టానం నుంచి తెలంగాణలో పార్టీ కార్యాలయానికి ఆదేశాలు వచ్చాయి. చికోటి ప్రవీణ్ పార్టీలో చేరికను తాత్కాలికంగా వాయిదా వేయాలని, ప్రస్తుతం ఎలాంటి చేరిక లేదని రాష్ట్ర అధిష్టానానికి సూచించారు.

చికోటి ప్రవీణ్ గత నెలలో ఢిల్లీకి వెళ్లి బీజేపీ నేతల్ని కలిశారు. బండి సంజయ్, డీకే అరుణను కలిసి శాలువా కప్పి సత్కరించారు. వీరితో పాటు రాంచందర్ రావును కూడా కలిశారు. ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితోనే పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకున్నట్లు వారికి స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డిల నుంచి ఏదో ఓ అసెంబ్లీ వస్తుందని, పోటీ చేస్తానని చికోటి భావించారు. ఇవన్నీ గమనిస్తే రేపో, మాపో చికోటి ప్రవీణ్ బీజేపీలో చేరతారని ప్రచారం జరిగింది. సంచలనం సృష్టించిన క్యాసినో కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న చికోటి ప్రవీణ్ ను పార్టీలో చేరే వరకు ఏం జరుగుతుందోనని అంతా భావించారు. ఊహించినట్లుగానే చివరి నిమిషంలో బీజేపీలో చికోటి చేరికకు బ్రేక్ పడింది.

# సిద్దిపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి**

కారులో మొత్తం 11 మంది ఉండగా.. ముగ్గురు సంఘటన స్థలంలోనే మృతి చెందారు. కారులో ఉన్న మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి గురయిన వారందరూ ఇందూర్ కళాశాల విద్యార్థులు. అతి వేగమే ఈ ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం ఎలా జరిగిందో తెలుసుకోడానికి దగ్గరిలో ఉన్న సీసీ కెమెరాల్లోని ఫుటేజీని పరిశీలిస్తున్నారు. పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

**ప్రమాదంపై మంత్రి హరీష్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి**

కాగా... సిద్దిపేటలో ఇంజనీరింగ్ విద్యార్థుల మృతి ఘటనపై మంత్రి హరీష్‌రావుతీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నలుగురు విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులను ఆదేశించారు. గాయాలైన మరికొంత మంది విద్యార్థులను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో మెరుగైన చికిత్స అందించాలన్నారు. మృతి చెందిన విద్యార్థులకు సంతాపం వ్యక్తం చేస్తూ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధైర్య పడొద్దని అండగా ఉంటానని విద్యార్థుల కుటుంబాలతో ఫోన్‌లో మాట్లాడి మనోధైర్యాన్ని నింపారు

# తెలంగాణకు మరోసారి అమిత్ షా

**విశాలభారతి, హైదరాబాద్:**

తెలంగాణ విమోచన దిన వేడుకల కోసం కేంద్ర హోం మంత్రి, బీజేపీ అగ్ర నేత అమిత్ షా తెలంగాణకు రానున్నారు. సెప్టెంబరు 17న ఈ వేడుకల్లో పాల్గొనడానికి ఒక్కరోజు ముందే అమిత్ షా హైదరాబాద్‌కు వస్తారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. ఈనెల 16న రాత్రి 7.55 గంటలకు ఔరంగాబాద్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి రానున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా సీఆర్పీఎఫ్ సెక్టార్స్ ఆఫీసర్స్ మెస్‌కు చేరుకుని ఆ రోజు రాత్రి అక్కడే బస చేయనున్నారు. 17న ఉదయం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ కు చేరుకుని తెలంగాణ విమోచన దిన వేడుకల్లో పాల్గొననున్నారు. ఆ తర్వాత జరిగే బహిరంగ సభలో తెలంగాణ ప్రజల నుద్దేశించి అమిత్ షా ప్రసంగించనున్నారు.

# చంద్రబాబుకు మళ్లీ నిరాశే..

**మొదటిపేజీ తరువాయి**

సదుపాయం కూడా ఏర్పాటు చేశామని అన్నారు. రాజమహేంద్ర కేంద్రకారాగారంలో 50 అడుగుల ఎత్తైన గోడలు ఉన్నాయని అదనపు ఏజీ కోర్టుకు తెలిపారు. ఆర్థిక నేరాల్లో సాక్ష్యాలను ప్రభావం చేసే అవకాశం ఉండటం వల్ల చంద్రబాబును హౌస్ రిమాండ్‌కు అనుమతించవద్దని న్యాయస్థానాన్ని కోరారు.

చంద్రబాబు తరఫున సుప్రీం కోర్టు న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. ఆయనకు జైలులో ప్రమాదం పొంచి ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కరుడుగట్టిన నేరస్థులు, ఆయుధాలు వాడిన నేరస్థులు అదే జైల్లో ఉన్నారని, చంద్రబాబుకు ముప్పు ఉన్న నేపథ్యంలోనే ఎన్ఎస్‌జీ భద్రత కల్పించారని లూథ్రా కోర్టుకు తెలిపారు. కేంద్రం కల్పించిన సెక్యూరిటీకి సంబంధించిన అంశంపై ఏపీ ప్రభుత్వం జోక్యం చేసుకునేందుకు అవకాశం లేదని కోర్టుకు విన్నవించారు. హౌస్ రిమాండ్‌కి సంబంధించి గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును లూథ్రా వివరించారు. ఇందుకు గౌతం నవలాఖ కేసును ఉదహరించారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి చంద్రబాబు హౌస్ రిమాండ్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ తీర్పు వెలువరించారు.

# షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు

**మొదటిపేజీ తరువాయి**

చేశారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గుర్తు చేశారు. అలాగే మూడు ఎకరాల భూమి ఇస్తానని చెప్పి.. మరోసారి దళితులను మోసం చేశారని ధ్వజమెత్తారు. ఎస్సీ సబ్ ప్లాన్ జాడ లేదు.. దళిత బంధు పేరుతో సబ్ ప్లాన్ను బంద్ చేశారని గుర్తు చేశారు. 100 సంవత్సరాలు అయిన దళిత బంధు పూర్తిస్థాయిలో రాదని.. వివక్షతకు గురైన సామాజిక వర్గాన్ని సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నారని విమర్శించారు. డబుల్ బెడ్ రూం పేరుతో దళితులను పూర్తిస్థాయిలో మోసం చేశారన్నారు.

**నాకు అంత వరకే తెలుసు**

దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అరెస్టుపై తాజాగా కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి స్పందించారు. ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరీ..చంద్రబాబు అరెస్టు గురించి తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ముందస్తు నోటీసులు, ఎఫ్ఐఆర్లో పేరు లేకుండా చంద్రబాబును అరెస్టు చేశారని తెలిసిందని అన్నారు. తనకు అంత వరకే విషయం తెలుసని తానింకా డాక్యుమెంట్లు చూడలేదని వివరించారు. సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల సన్నాహకాలలో భాగంగా.. నేతలకు దిశానిర్దేశం చేస్తూ.. హైదరాబాద్లోని బీజేపీ కార్యాలయంలో మాట్లాడారు. సోమవారం బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ చంద్రబాబు అరెస్టు తీరును ఖండించారు. జాతీయ నేతలు మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్.. ఆంధ్రప్రదేశ్లో రాజకీయ కక్షతోనే టీడీపీ అధినేతను అరెస్టు చేశారని మండిపడ్డారు. ఇలా ప్రతిపక్ష నేతలను అవినీతి మరక చూపి అరెస్టు చేయడం.. రాష్ట్రాన్ని ప్రభుత్వానికి తగదని సీఎం జగన్పై విమర్శలు చేశారు.

# గాంధీ విగ్రహాల ఎదుట నిరసన తెలపండి

**టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్**

**విశాల భారతి, హైదరాబాద్:**

టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా బుధవారం టీడీపీ శ్రేణులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టాలని టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పార్టీ నాయకులకు, శ్రేణులకు పిలుపునిచ్చారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోని గాంధీ విగ్రహాల ఎదుట నల్ల రిబ్బెన్లతో నిరసన తెలపాలన్నారు.

# 100 మంది విద్యార్థినులకు అస్వస్థత.. మంత్రి వేముల సీరియస్

- **అస్వస్థతకు గురైన విద్యార్థినిలను పరామర్శించిన కాంగ్రెస్, బిజెపి నాయకులు**






**బాల్కొండ, విశాలభారతి:**బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం రాత్రి భోజనం చేసిన తర్వాత దాదాపు 100 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థినులకు కడుపు నొప్పి, వాంతులు రావడంతో చికిత్స కోసం భీమ్‌గల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తమ పిల్లలు అస్వస్థతకు గురయ్యారని తెలుసుకున్న తల్లిదండ్రులు ఆసుపత్రికి చేరుకున్నారు. జిల్లా అధికారులకు సమాచారం అందడంతో హుటాహుటిన జిల్లా డీఎంహెచ్ వో సుదర్శనం భీమ్‌గల్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. చికిత్స కోసం నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం డీఎంహెచ్ వో సుదర్శనం కస్తూర్బా విద్యాలయానికి వెళ్లి పరిశీలించి భోజనం తయారు చేసే పరిసరాలు పరిశుభ్రంగా లేవని తెలిపారు. విద్యార్థులు తిన్న ఆహారాన్ని, నీరును పరీక్షల నిమిత్తం ల్యాబ్ కు పంపించామని అన్నారు.

**ఘటనపై మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సీరియస్**

ఫుడ్ పాయిజన్ ఘటనపై మంత్రి ప్రశాంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థినుల ఆరోగ్యం వైద్యసేవలపై ఆరా తీసారు. అస్వస్థతకు గురైన విద్యార్థినిల తల్లిదండ్రులు ధైర్యంగా ఉండాలని కోరారు.

**అస్వస్థతకు గురైన విద్యార్థినిలను పరామర్శించిన కాంగ్రెస్ నాయకుడు**

నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలలో చికిత్స పొందుతున్న విద్యార్థినిలను కాంగ్రెస్ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి పరామర్శించారు. సంఘటన వెనుక గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిలకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

**అస్వస్థతకు గురైన విద్యార్థినిలను పరామర్శించిన బిజెపి నాయకుడు**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిలను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి పరామర్శించారు. గతంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం సందర్శించడం జరిగిందన్నారు. ఆనాడు కూడా పాఠశాలలో విద్యార్థులకు కనీస వసతులు కరువయ్యాయని అన్నారు.



## కార్పొరేట్ఆస్పత్రులకు దీటుగా మహిళా ఆరోగ్య కేంద్రాలు

- **మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి**

**చండూర్, విశాల భారతి:** మహిళల ఆరోగ్యమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా మహిళా ఆరోగ్య కేంద్రాలను ప్రారంభిస్తోందని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని నారాయణపురం, చండూర్ మండల కేంద్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులలో మహిళా ఆరోగ్య కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు సమైక్య పాలనలో ప్రభుత్వ ఆసుపత్రులలో సరైన వైద్య సదుపాయాలు లేక ప్రజలకు ప్రభుత్వ దవాఖానలకు రావాలంటే జంకే వారని, తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రతి మండల స్థాయిలో ప్రభుత్వ ఆస్పత్రులను ఏర్పాటు చేసుకొని వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. వారంలో ఒకరోజు ప్రతి మంగళవారం మహిళల కోసం ప్రత్యేకంగా వైద్య సదుపాయాలు అందించాల నిర్ణయంతో ప్రత్యేక మహిళా ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ఈ ఆరోగ్య కేంద్రంలో అత్యాధునిక పరికరాలను ఉపయోగిస్తున్నారని చెప్పారు. ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో వైద్యసేవలు రోజురోజుకూ మెరుగుపడడం గర్వించదగ్గ విషయమన్నారు. ఉప ఎన్నికల్లో మంత్రి హరీశ్ రావు హామీ మేరకే మునుగోడు నియోజకవర్గంలోని 3 మండలాలలో 24/7 నిరంతర వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అలాగే నారాయణపురం, చండూర్ మండలంలో దాదాపు 35 మంది లబ్ధిదారులకు 14 లక్షల విలువగల సీఎంఆర్ఎఫ్‌చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం చండూరు మండలం పుల్లెంల గ్రామంలో భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అమ్మమ్మ బొబ్బల అనసూర్యమ్మ చనిపోవడంతో ఎమ్మెల్యే ఆమె పార్థివ దేహానికి పూల మాలవేసి నివాళి అర్పించారు. ఆయన వెంట పుల్లెంల బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



## బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు అన్నదానం

**బెల్లంపల్లి, విశాల భారతి:** బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం మధ్యాహ్నం బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతలు గుండారపు చక్రపాణిలలిత, వేణువంక సుమన్ శ్రీవిద్య సహకారంతో గర్భిణులకు బాలింతలకు, రోగులకు, అన్నార్తులకు సాయి భోజన్ అన్నదానం చేసినట్లు సనాతనధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు కాంపల్లి శంకర్ రాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని గర్భిణీలు, బాలింతలు, రోగులు, అన్నార్తులు, ఆసుపత్రి సిబ్బంది, సాయి భోజన్ అన్నదాన కార్యక్రమాన్ని వినియోగించుకున్నారు. వారందరూ అన్నదానం చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ.. బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ వారికి, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ ద్వారా "ఆకలితో ఉన్నవారిని అతిథి సత్కారంతో ఆదరిద్దాం అన్నదానంతో తృప్తి పరుద్దాం" అని ట్రస్ట్ వ్యవస్థాపకులు కాంపల్లి శంకర్‌రాజేశ్వరి పిలుపునిచ్చారు. సేవే లక్ష్యం, సేవే మార్గంతో ట్రస్ట్ కొనసాగుతుందని, మానవ సేవే మాధవ సేవ అని త్రవిద్య, శ్రవిద్య, త్రయాక్షర్ తెలిపారు. ఈ సేవా కార్యక్రమములో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, కోశాధికారి జక్కం నాగమణి సేవకులు డీ . మధుకర్, ఆకుల సాయి కుమార్, ఈగురపు భాస్కర్, వేల్పుల రాజేందర్, జక్కం ఉషశ్రీ, డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది, మీడియా సిబ్బంది, దాతలు , తదితరులు పాల్గొన్నారు. బాయిజమ్మసాయి సేవా ట్రస్ట్ ద్వారా అన్నదానం, సాయం అందించాలని అనుకునేవారు ట్రస్ట్ మేనేజర్ 8106550532, ఫౌండర్స్ 9959269975, 9949041595 సంప్రదించాలని కోరారు.

# కాగితాలకే పరిమితమైన మూసీ ప్రక్షాళన

- నిధుల కేటాయింపులు తప్ప అభివృద్ధి ఎక్కడ?
- మురికి కూపంగా మారి భయపెడుతోంది...
- వెంటనే సుందరీకరణ పనులు చేపట్టాలి
- బీజేపీ సీనియర్ నేత గూడూరు నారాయణరెడ్డి



విశాల భారతి, హైదరాబాద్:
మూసీ నదిని 'స్టైక్స్' (హిందూ పురాణాల్లోని వైతరిణి లాంటి నరకం నది)గా మార్చవద్దని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మూసీకి సుందరీకరణ కాగితాలకే పరిమితమైందని నది ప్రక్షాళనపై చేసిన వాగ్దాలన్నీ నీటిమీది గీతలుగానే మిగిలిపోయాయని ఆయన పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళనకు అనేక పథకాలు, కార్యక్రమాల ద్వారా సుందరీకరణకు వేల కోట్ల రూపాయలను కేటాయిస్తున్నట్లు, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ప్రకటించినా క్షేత్రస్థాయిలో ఏమీ చేయలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.754 కోట్లు బడ్జెట్‌గా ఇచ్చారని, కానీ గడిచిన ఆరేళ్లలో కేటాయించిన నిధుల్లో 3 శాతం మాత్రమే ఖర్చు చేశారన్నారు. మూసీ అభివృద్ధికి ప్రభుత్వం మరో కార్యక్రమం చేపట్టిందని, రూ.10 వేల కోట్ల బడ్జెట్ తో ప్రతిష్టాత్మకమైన ప్రణాళికను ప్రకటించిందని ఆయన వివరించారు. "ఈ మధ్యకాలంలో లండన్‌లో పర్యటించిన బీఆర్ఎస్ నాయకులు థేమ్స్ నది లాగా మూసీని అభివృద్ధి చేస్తామని చెప్పారని, నదిపై రూ.545 కోట్లతో 14 వంతెనలు, రూ.కోటితో ఎలివేటెడ్ స్కైవే నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. 4,240 కోట్లతో పాటు నాలుగు లేన్ల రేడియల్ రోడ్లకు రూ. 2,354 కోట్లు" అని ఆయన చెప్పారు. ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.8,973 కోట్లకు చేరింది మరియు ప్రభుత్వం ఆర్థిక సమీకరణకు సంబంధించిన విధి విధానాలను రూపొందిస్తోంది. అవసరమైన నిధులను ఎప్పుడు సేకరించగలదో ఎవరికీ తెలియదని ఆయన ఆరోపించారు. బాపూ ఘాట్, పురానాపూల్, ముస్లింజంగ్ బ్రిడ్జి, నయాపూల్, చాదర్‌ఘాట్, గోల్నాక, మూసర్మాబాగ్, నాగోల్, సింగారం వద్ద ఏర్పాటు చేసిన సుమారు 10 ఫ్లోటింగ్ ట్రాష్ బ్యారియర్‌లు ఆశించిన ప్రభావం చూపలేకపోయాయని ఆయన వాపోయారు. నది అభివృద్ధికి స్పెషల్ పర్పస్ వెహికల్, నోడల్ ఏజెన్సీగా ఏర్పాటు చేసిన మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎలాంటి ప్రభావం చూపలేకపోయిందని విమర్శించారు. గడిచిన 40 ఏళ్లలో మూసీ మురుగు కాలువగా మారిందని, 1980ల నుండి మూసి మురుగునీటి మార్గాల యొక్క చివరి గమ్యస్థానంగా మారిందని అన్నారు మరియు దానితో స్థానిక పౌరుల నుండి నది పట్ల ఉన్న దృక్పథం పూర్తిగా మారిపోయిందని, తరువాత పారిశ్రామిక వ్యర్థాలు మరియు రసాయన వ్యర్థాలు మూసీ నదిలో వేయబడ్డాయని, దీని ఫలితంగా నదిలో విష పదార్థాలు అధిక స్థాయిలో ఉన్నాయని దాంతో మూసి పరివాహక ప్రాంతంలో వ్యవసాయ ఉత్పత్తులలో మార్పు వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామిక వ్యర్థాలను డంపింగ్ చేయడం కాలుష్యానికి ప్రధాన కారణమని అని అనేక నివేదికలు సూచిస్తున్నాయని ఇవి కాకుండా ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీ నుండి కొవ్వు మరియు రక్తంతో సహా ఆసుపత్రుల నుండి బయో వ్యర్థాలు నేరుగా మూసీలోకి వెళ్తున్నటు తేలిందని అన్నారు. మూసీని పరిశుభ్రంగా మార్చడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని 2021లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఎత్తి చూపిందని ఆయన అన్నారు. 2022 సంవత్సరంలో ఎన్‌జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) తెలంగాణలోని నదుల కాలుష్య స్థాయిలను పరిశీలించిన తర్వాత నివేదించింది, మూసీ రాష్ట్రంలో అత్యంత కలుషితమైన నది. నాగోల్ ప్రాంతంలోని మూసీ విస్తీర్ణం బీవోడీ (బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్) పరంగా తీవ్రంగా కలుషితమైందని నివేదిక సూచించిందని ఆయన వివరించారు. గత నాలుగు శతాబ్దాలుగా హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలకు తాగునీరు, సాగునీటి వనరుగా ఉన్న మూసీని హైదరాబాద్‌కు పెద్ద డ్రైనేజీ లైన్‌గా మార్చడం దారుణమని నారాయణరెడ్డి వాపోయారు. క్లీన్ మూసీ ప్రాజెక్టును మరింత దిగజారకుండా కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

# నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా జాబ్ మేళా ఏర్పాటు

- **రాజకీయాలకు అతీతంగా జాబ్ మేళా నిర్వహణ**
- **మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి**




**బాల్కొండ, విశాలభారతి:**బాల్కొండ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకుల కోసం వేల్పూరు మండలం లక్కొరా ఏఎన్జి ఫంక్షన్ హాల్లో రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు నియోజకవర్గ యువత నుండి విశేష స్పందన లభించింది. 5,500 మంది ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోగా.. 4వేల పైచిలుకు మంది మెగా జాబ్ మేళాకు హాజరయ్యారు. 1236 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆశీర్వాదంతో గెలిచాను. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదంతో మంత్రి అయ్యాను అని అన్నారు. ఇన్ని రోజులు అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పని చేశాను. ఇప్పుడు యువతకు ఉద్యోగాలు కల్పించే లక్షంతో ఇలాంటి జాబ్ మేలాలు చేపట్టామని చెప్పారు. జాబ్ మేళాకు యువత పెద్ద ఎత్తున తరలివచ్చి సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఇప్పటికే న్యాక్ ద్వారా 12 వేల మంది యువతకు ఉద్యోగాలు ఇప్పించమని అన్నారు.
దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా 1లక్ష 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించలేదు. కాని సీఎం కేసిఆర్ ప్రభుత్వం కల్పించిందన్నారు. ఆసరా ఫౌండేషన్ వారి సౌజన్యంతో జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించాం. దాదాపు ఎంపికైన అభ్యర్థులకు అన్ని కంపెనీలు ఇక్కడే ఆఫర్ లెటర్ ఇచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ మధు శేఖర్, రైతు నాయకుడు కోటపాటి నర్సింహ నాయుడు, ఆసరా ఫౌండేషన్ చైర్మన్ బొల్లి శివ శంకర్, చందు, పలువురు అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

**నడిగూడెం, విశాల భారతి** :ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో బీసీ రాజకీయ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ కన్వీనర్ ధూళిపాళ ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు.బుధవారం మండలంలోని రత్నవరం గ్రామంలో జరిగిన బీసీ సంక్షేమ సంఘం శాఖ సమావేశానికి హాజరై ఆయన మాట్లాడుతూ జనాభాలో 56%గా ఉన్న బీసీల కొరకు బిల్లు ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదని, ఇంకా ఎన్నాళ్ళు బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగానే చూస్తారని, దేశవ్యాప్తంగా ఉన్న బీసీ ఎమ్మెల్యేలు ఎంపీలు ఈ విషయం పట్ల ఆలోచన చేయాలని, ఎస్సీలకు ఎస్టీలకు రాజకీయ రిజర్వేషన్ తో పాటు బీసీలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని కోరారు. దేశ వ్యాపితంగా ఉన్న బీసీ ప్రజా ప్రతినిధులు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. బి సి లను విస్మరిస్తే పాలకవర్గాలు తగిన మూల్యం చెల్లించుకొక తప్పదన్నారు. రానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో బీసీ బిల్లు ప్రవేశ పెట్టకపోతే కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు యావత్తు బీసీ కులాల వారు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో ఆయన వెంట బీసీ సంక్షేమ సంఘం కోదాడ నియోజకవర్గ అధ్యక్షులు ఇనుగుర్తి వెంకటరమణాచారి, జిల్లా ఉపాధ్యక్షుడు నిగిడాల వీరయ్య, బీసీ సంక్షేమ సంఘం కోదాడ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు మండవ నాగమణి బీసీ సంక్షేమ సంఘం నడిగూడెం మండల అధ్యక్షుడు యలగొండ నాగేశ్వరరావు బీసీ సంక్షేమ సంఘం గ్రామ కమిటీ నాయకులు సతీష్ తదితరులు ఉన్నారు.

# చంద్రబాబు క్షేమంగా బయటకు రావాలి

- **సర్వమత ప్రార్థనలు నిర్వహించిన ఎన్.ఎమ్.డి ఫిరోజ్**





**నంద్యాల,విశాలభారతి:** నంద్యాల పట్టణంలోని దేవాలయంలో.చర్చిలో.మద్రాసా నందు సర్వమత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్.ఎమ్.డి ఫిరోజ్ ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్యాయంగా తప్పుడు కేసులు బనాయించి జైల్లో పెట్టడానికి ఎన్నో దుష్ట శక్తులు పనిగట్టుకుని ఆయన వెంట పడ్డాయని అన్ని దుష్ట శక్తుల బారి నుండి రక్షించాలని ఆయన ఆరోగ్యం బాగుండాలని ఆయన కుటుంబ సభ్యులు మనో ధైర్యంగా ఉండాలని సర్వమత ప్రార్థనలు నిర్వహించడం జరిగిందన్నారు. తన 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఎక్కడ తప్పు చేయలేదని ముఖ్యమంత్రి జగన్ ఎన్ని కేసులు పెట్టిన ఎన్ని ఇబ్బందులు గురి చేసిన చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని కార్యకర్తల ధైర్యంగా ఉండాలి పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు మామిడి నాగరాజు, ఎన్.ఎమ్.డి షాకిర్, వెంకటసుబ్బయ్య గోపాలరావు, గోవిందనాయుడు, మల్లికార్జున, సుబ్బరాయుడు, సోహెల్ రానా దస్తగిరి బుగ్గ రాముడుసుధాకర్ అక్బర్ సైలాబ్ రవికుమార్ తెలుగుదేశం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## కాంగ్రెస్ విజయభేరి' సభను సక్సెస్ చేయండి

- **కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి**

**మహబూబాబాద్ / తొర్రూర్, విశాల భారతి :** సెప్టెంబర్ 17 న హైదరాబాద్ తుక్కుగూడలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా నిర్వహించే విజయభేరి బహిరంగసభను సక్సెస్ చేయాలని పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, పీసీసీ నాయకురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వరంగల్ పార్లమెంట్ పరిశీలకులు రవీంద్ర దాల్వి, పార్లమెంట్ వైస్ ఇన్‌చార్జి శోభారాణి, జనగాం జిల్లా డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, పీసీసీ సభ్యులు డాక్టర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గం నుంచి విజయభేరి సభకు భారీ సంఖ్యలో తరలివెళ్లి సక్సెస్‌చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## 'రాజకీయ పార్టీలకు మాదిగలకు శత్రువులు కావొద్దు'

**తిరుమలాయపాలెం, విశాల భారతి:** మంద కృష్ణ మాదిగ డిమాండ్ మేరకు పార్లమెంట్ సమావేశంలో ఎస్సీల వర్గీకరణ బిల్లు ఆమోదింప చేయాలని తిరుమలయపాలెం ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల స్థానిక అంబేద్కర్ సెంటర్ నందు జరుగు రిలే నిరాహార దీక్షలు పాలేరు నియోజకవర్గ ఇన్చార్జి చింతిరాల నాగభూషణం, మాదిగ అధ్యక్షతన జరగగా ముఖ్య అతిథిగా ఖమ్మం జిల్లా అధ్యక్షులు కూరపాటి సునీల్, మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో ఉద్యమం ప్రారంభించి సంపూర్ణ మద్దతు ఇచ్చి కూడా ఎందుకు వర్గీకరణపై నిర్లక్ష్యం పార్టీలు వహిస్తున్నయో చెప్పాలని రాజకీయ పార్టీల మౌనం వాళ్ళ రాజకీయ పతనానికి దారి తీస్తాయని వర్గీకరణపై చిత్తశుద్ధి ఉంటే చిట్టచివరి పార్లమెంట్ సమావేశంలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో (ఎం ఎస్ పి) మండల సీనియర్ నాయకులు పగిడిపల్లి బాబు, మాదిగ గౌరెపాటి దరగయ్య, ఎస్ డి సైదాబీ,చింతిరాల వినయ్ కుమార్ ,పగిడిపల్లి కరుణ, పంది వెంకయ్య, దాసరి రాంబాయి, తదితరులు పాల్గొన్నారు







# అసంపూర్తిగా ఉన్న కళాశాల భవనం నిర్మాణ పనులు పూర్తి చేయాలి

**ఆమనగల్లు, విశాల భారతి :**ఆమనగల్లు పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు స్వంత భవనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. వెంటనే అసంపూర్తిగా ఉన్న భవనం పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆమనగల్లు పట్టణంలోని ఎన్.ఎస్.యు.ఐ నాయకులు నిరసన చేపట్టారు. అనంతరం ఎన్.ఎస్.యు.ఐ మండల అధ్యక్షులు ఎండి ఫరీద్ మాట్లాడుతూ.. 2018 ఎన్నికల ప్రచారంలో స్వయంగా సీఎం కేసీఆర్ కళాశాల భవన నిర్మాణం వెంటనే చేపడుతామని చెప్పి నాలుగు సంవత్సరాలు అవుతున్నా . భవనం నిర్మించక పోవడం విచారకరమన్నారు. అదే సమయంలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సైతం హామీ ఇచ్చారని.. విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా వెంటనే కళాశాల భవనం నిర్మాణం పనులు చేపట్టాలని లేని పక్షంలో ఎమ్మెల్యే తన పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై తహసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆమనగల్లు పట్టణ అధ్యక్షులు జాజిమొగ్గల మహేష్, నాయకులు సిద్ధు, అతిఫ్ శివ, రాజేష్ కళాశాల విద్యార్థులు తదితరులు ఉన్నారు



# స్పోర్ట్స్ కిట్ లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే సతీష్ కుమార్

**సైదాపూర్, విశాల భారతి:**మంగళవారం సైదాపూర్ మండల కేంద్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో నందిని గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన శివాని హోమ్ ఫుడ్స్ ను ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ ప్రారంభించారు. అనంతరం సైదాపూర్ ఎంపీడీవో ఆఫీసులో 33 స్పోర్ట్స్ కిట్ లను ఎమ్మెల్యే ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా సంఘాలు మహిళల ఆర్థిక సాధికారికత కోసం కృషి చేస్తున్నాయని అన్నారు. మహిళలందరూ మహిళా సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అలాగే గ్రామీణ ప్రాంత యువతకు క్రీడల కోసం అన్ని రకాల క్రీడావస్తువులు ప్రభుత్వం అందజేస్తుందని వాటిని వినియోగించుకొని గ్రామీణ ప్రాంత యువత క్రీడలలో నైపుణ్యాన్ని పెంపొందించుకొని వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎమ్మెల్యే యువతకు పిలుపునిచ్చారు.

# హుస్నాబాద్ లో నేడు గులాబీ గర్జన

■ **ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్ రెడ్డి**




సైదాపూర్, విశాల భారతి:మంగళవారం ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్ రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు శుభం గార్డెన్ వద్ద జరిగే ఎన్నికల సన్నాహక సమావేశానికి హాజరై గులాబి శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నారు అని అన్నారు. ఈ సభకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్, మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతరావు, ఎమ్మెల్సీ బండ ప్రకాష్ హాజరుకానున్నారు అని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుండి వేలాదిమంది కార్యకర్తలు ఈ సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్ రెడ్డి, లస్మన్నపల్లి సర్పంచ్ కాయిత రాములు, మ్యాకల మల్లారెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.





# ప్రతి గడపకు బిఆర్ఎస్ సంక్షేమ పథకాలు

■ **ఎమ్మెల్యే జైపాల్ యాదవ్**

**ఆమనగల్లు, విశాల భారతి:**సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శవంతంగా నిలిచిందని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రతి పక్షాలకు ఓట్లు అడిగే హక్కు లేదని అన్నారు. మంగళవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని రైతు వేదిక కేంద్రంలో 29మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి అందచేశారు. అనంతరం పట్టణ కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న షాదీఖానా నిర్మాణ పనులను ముస్లిం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, గ్రంధాలయ డైరెక్టర్ కమటం రాధమ్మ వెంకటయ్య, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ రాంపాల్, కౌన్సిలర్ బైకని యాదమ్మ శ్రీశైలం, జామ మస్జీద్ కమిటీ అధ్యక్షులు మాసుం, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను మభ్యపెట్టేందుకే ప్రొసీడింగ్‌లు



**ఆమనగల్లు, విశాల భారతి:**ఎన్నికలు సమీపిస్తుండడంతో కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ప్రొసీడింగుల మీద ప్రొసిడింగులు తెస్తూ మరోసారి ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని బిజెపి జాతీయ నేత, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఆమనగల్ ప్రభుత్వ ఆసుపత్రిని 150 పడకలుగా మారుస్తానన్న ముఖ్యమంత్రి హామీ నీటి మూటలుగానే మిగిలిందన్నారు. ముఖ్యమంత్రిని మెప్పించలేని అసమర్థ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అని అన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రధానమంత్రి సడక్ యోజన కింద మేడిగడ్డ శంకర్ కొండ తండాని కలుపుతూ బీటీ రోడ్డుకు నిధులు మంజూరు అయిన.. బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశామని అన్నారు. మేడిగడ్డ, శంకర్ గ్రామాల మధ్యలో ఉన్న కత్వా వాగు నిర్మాణానికి నిధులు మంజూరై టెండర్లు పిలిచి సంవత్సరం దాటిపోతున్న కాంట్రాక్టర్లను బెదిరించి పనులు చేయించకుండా ఎమ్మెల్యే కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ఆ ప్రాంత ప్రజల బాధలను అర్థం చేసుకొని బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆచారి కోరారు.

# వైద్య రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి

■ **ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి**

**వలిగొండ, విశాలభారతి:** వైద్యరంగ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. వలిగొండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఆరోగ్య మహిళా క్లినిక్ ను యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తో కలిసి ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి ప్రారంభించారు అనంతరం ఎమ్మెల్యే పైళ్ళ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళల ఆరోగ్య భద్రతే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని రూపొందించారని అన్నారు. ఆరోగ్య మహిళ క్లినిక్ లో మహిళలకు 57 రకాల పరీక్షలు అందుబాటులో ఉంటాయని ముఖ్యంగా మహిళలు ఎదుర్కొనే 8 రకాల సమస్యల కు వైద్యం అందిస్తారని ఈ అవకాశాన్ని అవసరమైన మహిళలు సద్వినియోగ చేసుకోవాలని అవసరమైతే మెరుగైన వైద్య సేవల కోసం పెద్దాసుపత్రులలో వారికి 24 గంటల ప్రత్యేక హెల్ప్ డెస్కులు అందుబాటు లో ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్, సర్పంచ్ బోల్ల లలిత శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పైళ్ళ రాజ్యవర్దన్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి, రైతుబంధు కోఆర్డినేటర్ పడమటి మమత నరేందర్, మహిళా అధ్యక్షురాలు మద్దెల మంజుల నాగరాజు, వైద్యాధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.







# మహిళ ఆరోగ్యమే ఇంటికి సౌభాగ్యం

**ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్**

**సైదాపూర్, విశాల భారతి:** మహిళల సమగ్ర ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. మహిళల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆరోగ్య మహిళా పథకాన్ని సైదాపూర్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రతీ మహిళ ఆరోగ్యంగా ఉండాలనేదే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్ష. మహిళ ఆరోగ్యమే ఇంటికి సౌభాగ్యం అని నమ్మే నాయకుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. ఆరోగ్య మహిళ పథకంలో 8 రకాల చికిత్సలు అందుబాటులో ఉంటాయని, ఆరోగ్య మహిళా కేంద్రాల్లో నిపుణులైన మహిళా సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు. వైద్య సేవలు, అవసరమైన పరీక్షలు, మందులు కూడా ఉచితంగా ఇస్తారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్ రెడ్డి, తహసిల్దార్ దూలం మంజుల, ఎంపిడివో పద్మావతి, వైస్ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, సర్పంచులు చంద శ్రీనివాస్, కాయిత రాములు, రెవెన్యూ పరిశీలకులు శరత్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య మహిళా క్లినిక్‌లో మహిళలకు అన్నిరకాల సేవలందించాలి

**నల్గొండ కలెక్టర్ ఆర్వీ కర్ణన్**



**శాలిగౌరారం, విశాలభారతి:** శాలిగౌరారం మండల కేంద్రంలో మంగళవారం జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్ విస్తృతంగా పర్యటించారు .ఈ సందర్భంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా క్లినిక్ ను నల్గొండ జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆర్. వి కర్ణన్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మహిళలకు అన్ని రకాల వైద్య సేవలను అందించాలని ముఖ్యంగా ఆశా వర్కర్లు గ్రామీణ ప్రాంతంలోని అందుబాటులో ఉంటూ పని చేయాలని సూచించారు. గర్భిణులకు అంగన్వాడీల ద్వారా అందాల్సినటువంటి పౌష్టిక ఆహారం సకాల సమయానికి అందించాలని సూచించారు. వైద్య సిబ్బంది కూడా ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. అనంతరం పీఏసి ఎస్ సి కార్యాలయం వద్ద రైతులకు సకాలంలో ఎరువులను అందిస్తున్నారా లేదా అని స్వయంగా అధికారులతో రైతులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం అందించాలని ఇలాంటి అవకతవకలు జరగకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కొండల్ రావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ వెంకన్న, జడ్పీటీసీ ఎర్ర రణీల యాదగిరి, ఎంపీటీసీ జోగు సైదమ్మ ,స్థానిక ఎంపీడీవో రేఖలా లక్ష్మయ్య ,తహసీల్దార్ పాల్ సింగ్, అంజనేయులు , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# సిసి రోడ్డు నిర్మాణానికి 6 లక్షల విరాళం

**ఆమనగల్లు, విశాల భారతి:**ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డి పల్లి గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు కాంగ్రెస్ నాయకులు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్ రెడ్డి మంగళవారం 6 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ విరాళంతో నిర్మించనున్న రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని హనుమాన్ ఆలయ ప్రహరీ గోడ నిర్మాణానికి 50వేల విరాళాన్ని ఆయన ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలో విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలతో పాటు ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మంగ్లీ రాములు, నాయకులు మానయ్య, రాజశేఖర్, కృష్ణ, రవియాదవ్, గబ్బర్ పాల్గొన్నారు

# సామాజిక న్యాయాన్ని విస్మరిస్తే బీజేపీకి పతనం తప్పదు

**ఏపూరి వెంకటేశ్వర్లు మాదిగ**




**భద్రాచలం, విశాల భారతి:** సామాజిక న్యాయమైన ఒక్క రూపాయి కూడా ఖర్చు లేని ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఈనెల 18 నుండి జరిగే పార్లమెంటు సమావేశాల్లో చట్టబద్ధత కల్పించకపోతే తెలంగాణలో బిజెపి పార్టీకి పతనం తప్పదని ఎంఎస్పీ ఎమ్మార్పీఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌చార్జి ఏపూరి వెంకటేశ్వర్లు మాదిగ దీపంగి రమణయ్య మాదిగ డిమాండ్ చేశారు. స్థానిక భద్రాచలం అంబేద్కర్ సెంటర్లో ఎంఎస్పి ఎమ్మార్పీఎస్ కమిటీల ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు 18 నుండి జరిగే అత్యవసర పార్లమెంటు సమావేశాల్లో చట్టబద్ధత కల్పించాలని రిలే నిరాహార దీక్షలు ఏపూరి, దేపంగి రమణయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి రాకముందు మేము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామన్న ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలు దాటిన వర్గీకరణ చేయకపోవడం వలన గత 19 సంవత్సరాలుగా విద్య ఉద్యోగం సంక్షేమ రంగాల్లో మాదిగ మాదిగ ఉపకులాలకు అన్యాయం జరుగుతుందని బిజెపి ప్రభుత్వం వెంటనే పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టి సామాజిక న్యాయాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ రిలే నిరాహార దీక్షకు సామాజిక ఉద్యమ నేత తొలి తరం ఉద్యమ నాయకుడు ఉద్యమం లో సహాయపడుతున్న భీమపాక పెదరాజు మాదిగ ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్ లో ప్రవేశపెట్టాలి అని అయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇతర రాజకీయ పార్టీలు బిజెపి పై ఒత్తిడి పెంచి బిల్లు పాస్ చేయించాలని బిజెపి మౌనం వహిస్తే కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ బిల్లు పెట్టి వర్గీకరణకు చట్టబద్ధత చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు వర్గీకరణ సాధించుకోవడానికి మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం నిరంతరం పోరాటాలకు యువత విద్యార్థులు ఉద్యోగులు సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ దీక్షను ఉద్దేశించి ప్రసంగించారు. దీక్షలు కూర్చున్న వారు ఎం ఆర్ పి ఎస్. యం యస్ పి నాయకులు కనుక శ్రీనివాస్ మాదిగ భద్రాచలం నియోజకవర్గ ఇన్చార్జ్ తోకల దుర్గాప్రసాద్ మాదిగ టౌన్ అధ్యక్షుడు పొట్ట పింజరి ప్రకాశ్ మాదిగ, మాజీ నాయకులు కోటా రవికుమార్ మాదిగ, కొమ్మగిరి వెంకటేశ్వర్లు మాదిగ, బొక్క రాంబాబు మాదిగ, నారా పొంగు దుర్గాప్రసాద్, పింగళి నాగరాజు మాదిగ మాదిగ, కారుమంచి సతీష్ మాదిగ, మువ్వేటి శివ పేరాల శోభన్ బాబు, కే శివ తేలూరి సాంబశివరావు, పింగళి వెంకన్న బాబు,ఎంఎస్పీ ఎంఎస్పి ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు కాంగ్రెస్ అధ్యక్షులుగా జగన్



**ఆమనగల్లు, విశాల భారతి :**ఆమనగల్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా తెల్గమల్ల జగన్ ను నియమించినట్లు తెలంగాణ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఆమనగల్లు మండల అధ్యక్షులుగా జగన్ ను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనను నియమించిన సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీ చందు రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.



# నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం

■ **రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

ఆమనగల్లు, విశాల భారతి:నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గం అభివృద్ధిలో భాగంగా ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి గతంలో ఇచ్చిన మాట ప్రకారం రూ.6లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణము మంగళవారం ప్రారంభించారు. అదేవిదంగా హనుమాన్ దేవాలయ ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.50వేలు అందచేశారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి, బీఆర్ఎస్ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మండ్లి రాములు, పట్టణ అధ్యక్షులు మానయ్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్, గ్రామ అధ్యక్షుల కృష్ణ, నాయకులు మైసయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.





# పల్లె పల్లెకు గుండె గుండెకు కాంగ్రెస్

■ **అంగన్వాడీ టీచర్ల, హెల్పర్ల సమ్మెకు మద్దతు**

■ **కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్ కుమార్**

**బాల్కొండ, విశాలభారతి:**బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలం బాచన్ పల్లి, పిప్రి గ్రామాలలో మంగళవారం పల్లె పల్లెకు గుండె గుండెకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్ కుమార్ నిర్వహించారు. ఇందులో భాగంగా రెండు గ్రామాల్లో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకొని కాంగ్రెస్ గ్యారంటీ పథకాలను వివరిస్తూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు.

**అంగన్వాడీ టీచర్ల, హెల్పర్ల సమ్మెకు మద్దతు**

భీమ్‌గల్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్ల, హెల్పర్ల సమ్మెకు కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్ కుమార్ మద్దతు తెలిపి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడిల న్యాయబద్ధమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కాంగ్రెస్ పార్టి అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్వాడిల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నడిగూడెంలో ఎస్జీఎఫ్ క్రీడలు ప్రారంభం

**నడిగూడెం, విశాలభారతి :**గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను గుర్తించేందుకు ఎస్ జి ఎఫ్ క్రీడలు దోహద పడతాయని నడిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభన్ బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన ఎస్ జి ఎఫ్ క్రీడలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు గెలుపు ఓటములు సమానంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సామినేని శ్రీనివాస్ రావు, సుబ్రహ్మణ్యం, వ్యాయమ ఉపాధ్యాయులు గడ్డం వెంకటేశ్వర్లు, ప్రకాష్, నాగేశ్వరరావు, సరళ దేవి, సునీత శైలజ,వెంకటేష్,నాగన్న,కరుణాకర్, వీరేశం, హరీష్, సుధారాణి, కరిష్మా తదితరులు పాల్గొన్నారు.






# ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**మహబూబాబాద్/ తొర్రూరు, విశాల భారతి:** ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అమ్మాపురం జడ్పీహెచ్ఎస్ పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ అన్నారు. శ్రీ సోమేశ్వర గోశాల ఆధ్వర్యంలో తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుల ఆదేశానుసారంగా మంగళవారం పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడటం వలన వాతావరణ కాలుష్యం దెబ్బతింటుందని, వాడి పడేసిన తర్వాత భూమి లో కరిగిపోకుండా ఉండి భూసారాన్ని దెబ్బతీస్తుందని, ప్లాస్టిక్ వాడకానికి బదులుగా గోనె సంచులు వాడాలని ఈరోజుల్లో కూరగాయలు, టిఫిన్లకు ఎలాంటి చిన్న అవసరాలకు కూడా ప్లాస్టిక్ ను అధికంగా వినియోగించడం ద్వారా భూమిని వాతావరణ కాలుష్యాన్ని చాలా వరకు నష్టం చేస్తున్నామని, ఈ ప్లాస్టిక్ మహమ్మారిని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ ఇంట్లో నుండి ఏ సరుకులు తీసుకోవడానికి బయటకు వెళ్లిన గోనెసంచులను తీసుకొని వెళ్లి భవిష్యత్ తరాలకు సస్య శ్యామలమైన నేలను వాతావరణన్ని అందించిన వారం కావాలని, తెలంగాణ గోశాల ఫెడరేషన్ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ ఎన్నో కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, గోశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాలో పేర్ల సవరణ ప్రక్రియను వేగవంతం చేయండి

- స్వచ్ఛమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించండి
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనా





**నంద్యాల,విశాలభారతి:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలో పేర్ల సవరణ ప్రక్రియను వేగవంతం చేసి ఈనెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లను సూచించారు. మంగళవారం ఎలక్షన్ కమిషన్ కార్యాలయం నుండి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ "ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ 2024" కు సంబంధించి ఓటర్ల జాబితా పునఃపరిశీలన, 6,7,8 ఫామ్ ల స్వీకరణ, ఇంటింటి సర్వే, డూప్లికేట్, షిఫ్టెడ్, డెత్ ఎలెక్టోరల్స్, జంక్ క్యారెక్టర్, 10 కంటే ఎక్కువ ఓట్లు ఉన్న హౌసెస్, రేషనలైజేషన్ ఆఫ్ పోలింగ్ స్టేషన్స్, మొదటి, రెండవ, మూడవ దశ లో ఎపిక్ కార్డ్స్ జనరేషన్, ప్రింటింగ్, పంపిణీ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ పుల్లయ్య, అన్ని నియోజకవర్గాల ఈఆర్ఓలు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణకు సంబంధించి 75,259 ఓటర్లను పునఃపరిశీలించి నివేదికలు సమర్పించామన్నారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లి, డోన్ అసెంబ్లీ నియోజకవర్గాల నుండి రాజకీయ పార్టీ ప్రతినిధులు సూచించిన 27,194 బోగస్ ఓట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి తొలగించామని వివరించారు. 6,7,8 ఫామ్ లకు సంబంధించి స్వీకరించిన 42,843 దరఖాస్తులలో 18,433 ఓటర్ జాబితాలో పొందుపరిచామని పెండింగ్లో ఉన్న 21,989 క్లెయిమ్స్ ను నాలుగు రోజుల్లో పూర్తి చేస్తామని కలెక్టర్ వివరించారు. డూప్లికేట్, షిఫ్టెడ్, డెత్ ఓటర్లకు సంబంధించి 47,432 ఓట్లను జాబితాలోసవరించామన్నారు. తొలగించిన ఓట్లకు సంబంధించి పెండింగ్లో ఉన్న 26,587 ఓట్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాలుగు రోజుల్లో పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఇంటింటి సర్వేలో 10,936 ఓటర్లు కొత్తగా నమోదు చేసుకున్నారన్నారు. జంక్ క్యారెక్టర్ కు సంబంధించి పెండింగ్లో ఉన్న 105 ఓటర్లను, 10 కంటే ఎక్కువ ఓట్లు వుండి పెండింగ్ లో ఉన్న 3908 గృహాలను క్షేత్రస్థాయిలో పునఃపరిశీలించి జాబితాలో పొందుపరుస్తామని కలెక్టర్ వివరించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలోని సవరణలు, జంక్ క్యారెక్టర్స్, చేర్పులు మార్పులు తదితరాలకు సంబంధించి వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి ఈ నెల 15 తేదీలోగా స్వచ్ఛమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఈఆర్ఓ, ఏఈఆర్వోలను ఆదేశించారు.



# క్రీడల్లో ప్రతిభ చూపుతున్న 'సెయింట్ జోసెఫ్' స్టూడెంట్లు

**గరిడేపల్లి, విశాల భారతి :** ఇటీవల సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్ 14 మండల స్థాయి ఆటల పోటీలలో దాదాపు 12పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కి 6గురు విద్యార్థులు ఖో ఖో క్రీడలో ప్రథమ స్థాయిలో నిలువగా, కబడ్డీ క్రీడల ద్వితీయ స్థాయిలో డివిజన్ స్థాయి కి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రెవరెంట్ ఫాదర్స్ ఆరికె జోనేష్,జోస్ లు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని, విద్యార్థులు క్రీడలలో రాణించి ఉన్నత స్థాయికి చేరాలని అన్నారు. తమ పాఠశాల నుంచి ఎన్నికైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిస్టర్ అనూష, సిస్టర్స్ జైమోల్, సుజిత, అరుణ, వీరస్వామి,ఉపేంద్ర చారి, గురుస్వామి,మమత,మౌనిక, స్వాతి, ఎం. నాగరాజు, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# హైందవ ధర్మాన్ని నాశనం చేయడమే 'ఇండియా'

- ఉదయనిధి వ్యాఖ్యలను ఖండించిన తారప్రసాద్




**మణుగూరు, విశాల భారతి :** హిందువులను, హిందూ దేవుళ్లను, హిందూ పండుగలను అవహేళన చేయటం దొంగ దేశ భక్తులకు ప్యాషన్ అయ్యింది. అటువంటి దొంగ భారతీయుల కీలు ఎంచి వాత పెట్టే రోజు త్వరలోనే ఉంది అని బిజెపి పార్టీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు తారప్రసాద్ అన్నారు. మంగళవారం నాడు మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల దేశ రాజకీయాల్లో అనేక మార్పులు జరగడం మనం చూస్తూ ఉన్నాం. గతంలో శత్రువులుగా ఉన్న కొన్ని రాజకీయ పార్టీలు మిత్రులు కావడం, మిత్రులుగా ఉన్న కొన్ని రాజకీయ పార్టీలు శత్రువులుగా మారటం గమనిస్తూ ఉన్నాం అన్నారు. హైందవ ధర్మాన్ని నాశనం చేయడమే ఇండియా కూటమి లక్ష్యమా? అని ప్రశ్నించారు. తమిళనాడు ముఖ్య మంత్రి స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్ మరో ముందుడుగు వేసి తాను ఎదో వేదాలు ఉపనిషత్తులు, పురాణాల చదివిన వాడిగా సనాతన ధర్మం కరోనా, మలేరియతో పోలుస్తూ దానిని నిర్మూలించాలి అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అసలు ఉదయనిధి స్టాలిన్ హిందువు కాదు. మతం మారిన స్వయం ప్రకటిత నాస్తికుడు. ఇటువంటి నాస్తికులు చేస్తున్న బాధ్యతరహిత వ్యాఖ్యలను బిజెపి పార్టీ జిల్లా యువ మోర్చా జిల్లా అధ్యక్షులు తారప్రసాద్ తీవ్రంగా ఖండించారు.



# అంగన్వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- సీఐటీయూ జిల్లా నాయకుడు బొల్లం అశోక్ యాదవ్

**మహబూబాబాద్/ తొర్రూర్, విశాల భారతి :** అంగన్వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించి కనీస వేతనం 26 వేలను ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకులు బొల్లం అశోక్ యాదవ్ డిమాండ్ చేశారు. అంగన్వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరింది. తొర్రూర్ పట్టణ కేంద్రంలో అమరవీరుల స్థూపం వద్ద అంగన్వాడి టీచర్లు, ఆయాలు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొల్లం అశోక్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువగా కష్టపడుతున్నారు, ఎక్కువ సమయం పని చేస్తున్నారు వేతనం మాత్రం తక్కువ ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. అంగన్వాడి ఉద్యోగులకు ఉన్న సమస్యలు రిటైర్మెంట్ గ్రాట్యుటి బెనిఫిట్స్ 10 లక్షల రూపాయలు ఇవ్వాలని, అంగన్వాడిలకు ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలను కల్పించాలని ఐసిడిసి ఐసిడిఎస్ బడ్జెట్ పెంచి వారిని బలోపేతం చెయ్యాలని 2017 నుండి పెండింగ్ లో ఉన్న ఐఏడిఏ లను వెంటనే విడుదల చేయాలని 2018లో కేంద్ర ప్రభుత్వం పెంచిన వేతనం అంగన్వాడి టీచర్లకు 1500 హెల్పర్లకు 750 మినీ వర్కర్లకు 1250 రూపాయలను దానికి సరిపడ బడ్జెట్ వెంటనే రిలీజ్ చేయాలని వారు తెలిపారు బడ్జెట్ ఉన్న అన్నిటికి ఇవ్వాలని డిమాండ్ చేశారు అంగన్వాడి ఉద్యోగులకు హెల్త్ కార్డులు వేతనంతో కూడిన మెడికల్ సెలవులు అమలు చేయాలని ప్రభుత్వ పాఠశాలలో సమానంగా అంగన్వాడీ కేంద్రాల్లో సెలవులు ఇవ్వాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం డి యాకూబ్, సిఐటియు మండల కార్యదర్శి జమ్ముల శ్రీను, తిమ్మిడి రవి అంగన్వాడీ వర్కర్లు మరియు హెల్పర్లు సుకన్య, లలిత, మంజుల, సాంబలక్ష్మి, పద్మ రాణి, ప్రమీల, మనోధార, సైదాబీ, సురేఖ, రామ నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

# హస్త కళలపై విద్యార్థులకు అవగాహన



**గరిడేపల్లి, విశాల భారతి :** సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో హస్త కళల సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థినిలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హస్తకళలపై విద్యార్థులకు అవగాహన కల్పించి ,వాటిని ఎలా తయారు చేసుకోవాలో చెప్పారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఎంబ్రాయిడరీ, టై అండ్ డై, పేపర్ కాఫ్ట్స్, బాతిక్, అభరణాలు ఎలా తయారు చేయాలో నేర్పించారు. అంతే కాకుండా దుస్తులకి వచ్చే లేబుల్స్ లో ఉండే చిహ్నాలను ఎలా గుర్తించాలో తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు , సామాజిక కళాశాల విద్యార్థినీలు శ్వేత, స్నేహ, సింధుజ, అక్షిత, హరిత, మధుమిత, రజిత, నాడీన్ పుష్ప తదితరులు పాల్గొన్నారు



# ఆడబిడ్డల సంక్షేమమే రాష్ట్ర సర్కార్ ధ్యేయం

- ఆరోగ్య మహిళతో వ్యాధులన్నింటికీ చికిత్స
- మహిళల ఆరోగ్యానికి సీఎం కేసీఆర్ కృషి
- రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

పినపాక, విశాల భారతి : పినపాక మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు ఏర్పాటుచేసిన మహిళా ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం నాడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభోత్సవం చేసారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మరో అద్భుతమైన కార్యక్రమం ఆరోగ్య మహిళ ఇలాంటి కార్యక్రమాన్ని ప్రారంభించుకోవడం ఆనందంగా ఉన్నదని ఆయన అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో మహిళల ఆరోగ్యానికి సీఎం ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు మహిళలు ఏదో పనిలో ఉంటూ ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా ఉండడంతో తీవ్ర నష్టం జరుగుతుంది అన్నారు. అలాంటి పరిస్థితులు రాకుండా ఉండడానికి ప్రభుత్వం ఆరోగ్య మహిళా కేంద్రాలను ఏర్పాటు చేసింది అన్నది సేవలలో రోగాన్ని మొదట్లోనే గుర్తించి నివారించనున్నట్లు తెలిపారు. మహిళలకు ఎలాంటి సమస్యలున్న పి హెచ్ సికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు, ప్రతి మంగళవారం మహిళల కోసం ప్రత్యేక ఓపి ఏర్పాటు చేయడం జరుగుతుంది అన్నారు. సీఎం కేసీఆర్ ఆడపిల్ల పుట్టిన దగ్గరి నుంచి వివాహమై పాపకు జన్మించే వరకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు మరో అడుగు ముందుకు వేసి ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ప్రారంభించుకోవడం జరిగిందని ఆయన అన్నారు.



# వర్గీకరణ పోరుకు మాదిగలు సిద్ధంగా ఉండాలి

**మఠంపల్లి, విశాల భారతి :** సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలను తహసీల్దార్ ఆఫీస్ ముందు దీక్షలను మఠంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దేవపంగు బాబు, ప్రధాన కార్యదర్శి గోలి లచ్చిరెడ్డి, కార్యదర్శి కరుణాకర్ ప్రారంభించారు. దీక్షకు హుజూర్నగర్ ఎంఎస్పి నియోజకవర్గ ఇన్చార్జిబచ్చలకూరి ప్రసాద్ మాదిగ.హాజరై మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంక వంద రోజులలో ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ బిల్లును చేస్తానని చెప్పి తొమ్మిది సంవత్సరాలు దాటిన గాని ఇచ్చిన మాటను మరిచి పోయిందని గుర్తుచేస్తూ ఇచ్చిన మాటకు కట్టుబడి అత్యవసర ఈ పార్లమెంటు సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని మందకృష్ణమాదిగ ఆదేశానుసారం జిల్లా నియోజకవర్గ మండల స్థాయిలలో దీక్షలు చేపట్టాలని అదేవిధంగా వర్గీకరణ లేకపోతే విద్యా ఉద్యోగ అవకాశాలలో విద్యార్థులు నష్టపోతున్నారని. రాజకీయ రంగాలలో మాదిగలు మాదిగ ఉపకులాలురిజర్వేషన్ ఫలాలు అందడం లేదని గత 29 సంవత్సరాలుగా అలు పెరిగిన పోరాటం ఏమార్పియస్ ఆధ్వర్యంలో సామాజికంగా న్యాయమైన ఈ డిమాండును కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీలు. బిఆర్ఎస్ ఎంపీలు. మిత్రపక్షాలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని మేము వారికి ఇట్టి దీక్షలు ద్వారా తెలియజేస్తున్నాం దీక్షలో కూర్చున్నవారు మఠంపల్లి మండల ఎంఆర్పిస్ అధ్యక్షులు దేవపంగు బాబు మాదిగ మండల ఎంఎస్పీ అధ్యక్షులు కస్తాల వెంకటేశ్వర్లు మాదిగ. మండల ఎంఆర్పిఎస్ అధికార ప్రతినిధి. తుళ్లూరి నాగేష్ మాదిగ ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి పగిడిమర్రి బాబు తదితరులు పాల్గొన్నారు.




# వర్గీకరణ చేపట్టకపోతే బీజేపీ పతనం ఖాయం

- ఎంవీఎఫ్‌జాతీయ ప్రధాన కార్యదర్శి కత్తి వెంకటేశ్వర్లు

**నడిగూడెం, విశాలభారతి:** ఈనెల 18వ తేదీ నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎం వి ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కత్తి వెంకటేశ్వర్లు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జ్ పూరుగంటి అంజయ్య మాదిగలు అన్నారు.మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీల వర్గీకరణ చేపడుతామని చెప్పిన బిజెపి ప్రభుత్వం పది సంవత్సరాలు పూర్తికావస్తున్న నేటి వరకు వర్గీకరణ చేపట్ట పోవటం సోషనీయమన్నారు. బిజెపి ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు వర్గీకరణ చేపట్టకపోతే రాబోయే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్ఎఫ్ నాయకులు పందిటి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సైగా ఎంపికైన మహిళా కానిస్టేబుల్ ను అభినందించిన ఎమ్మెల్యే

**చండూర్ , విశాల భారతి:** చండూరు పోలీస్ స్టేషన్‌లో ఏడాదిగా పనిచేస్తున్న గంజి విజయ అనే మహిళా కానిస్టేబుల్ ఇటీవల విడుదలైన ఎస్సై ఫలితాల్లో ఉద్యోగానికి ఎంపిక అయింది. ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డిని ఆమె మంగళవారం చండూరులో కలవడంతో ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. మహిళలు గృహిణిగానే పరిమితం కాకుండా తమలోని ప్రతిభ, పాటవాలకు పదును పెట్టి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సురేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# బీరప్ప కురుమ యూత్ కమిటీ అధ్యక్షుడిగా పర్శరాములు

**దేవరుప్పుల, విశాల భారతి :** దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి గ్రామంలో నూతన బీరప్ప కురుమ యూత్ సంఘం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్యఅతిథిగా గౌరవ అధ్యక్షులు నోముల చిన్న వీరన్న విచ్చేసి నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. అధ్యక్షుడిగా భూమాండ్ల పరశురాములు ప్రధాన కార్యదర్శిగా జోగు పెద్ద మహేందర్ జోగు మహేందర్ ఎన్నికయ్యారు ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ మన సంఘ అభివృద్ధికి పేద కుటుంబాల అన్యోన్యతకు ఎంతో తోడ్పడి ఉండి సంఘం యొక్క అభివృద్ధికి కట్టుబాటుగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్స్ ఉపాధ్యక్షులు రాగుల కృష్ణ, కర్రె. శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు జోకు నాగరాజు, భాస్కర్, ప్రచార కార్యదర్శి జోగు శివకుమార్, అనిల్, మహేందర్, ముఖ్య సలహాదారులు వట్టిపల్లి యాదగిరి, తెలుగు శ్రీశైలం, దావర మహేందర్, దొంగ సారయ్య, కర్రె వీరస్వామి, జోగు శ్రీశైలం, కార్యవర్గ సభ్యులు జోగు కృష్ణ, జోగు నరేష్, రాగుల ప్రవీణ్, జోగు భద్రయ్య, వినోద్, భూమండ్ల సుమన్, వట్టిపల్లి అనిల్, జోగు రవి, నోముల సతీష్, నోముల మల్లయ్య జోగు నరసయ్య, కర్రె. మల్లేష్, జోగు నవీన్, రామన్న, భూమండ్ల మహేందర్, జోగు సోమరాజు మరియు కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మానసిక ఆందోళనతో మహిళ ఆత్మహత్య

**చిట్యాల, విశాల భారతి:** మానసిక ఆందోళనతో పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన చిట్యాల మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం నేరడ గ్రామానికి చెందిన మందుగుల ఎల్లయ్య తండ్రి వెంకటయ్య కూతురు మందుగుల గీత(22) గత కొంతకాలంగా మానసిక వ్యాదితో బాధపడుతూ, హాస్పిటల్ లో చూపించిన కూడా తగ్గకపోవడం వలన జీవితం పై విరక్తి చెంది మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగడంతో నల్లగొండ లో ప్రభుత్వ హాస్పిటల్ కు తీసుకొని వెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మరణించడం జరిగింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు

# ఆరోగ్య మహిళా కేంద్రంను ప్రారంభించిన మంత్రి 'ఎర్రబెల్లి'



**పాలకుర్తి, విశాల భారతి:** జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ దావఖాన లో మంగళవారం ఆరోగ్య మహిళా క్లీనిక్ ను ప్రారంభోత్సవం చేసిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఈ సందర్భంగా మంత్రి హాస్పిటల్ లో హెల్ప్ డెస్క్ ను ప్రారంభించారు. హాస్పిటల్లో అందుతున్న వైద్య సేవలను మంత్రి పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిందిగా వైద్యాధికారులను ఆదేశించారు. మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ" మహిళల ఆరోగ్యం కోసం రాష్ట్ర వ్యాప్తంగా విడతల వారీగా మొత్తం 1200 మహిళా క్లినిక్‌లను ఏర్పాటు చేయుటకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున రాష్ట్ర వ్యాప్తంగా గత మార్చి 8 వ తేదీన రాష్ట్రంలో 100 మహిళా ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసుకొన్నాము. జనగాం జిల్లాలో మొదటి విడతలో రెండు మహిళా ఆరోగ్య కేంద్రాలు స్టేషన్ ఘన్ పుర్ ఇప్పగూడెం ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 2 వేల 564 మందికి పరీక్షలు చేసి 251 మందిని జిల్లా కేంద్రానికి రిఫర్ చేయడం జరిగింది. ప్రస్తుతం రెండో విడతలో భాగంగా ఈ రోజు మరొక 100 మహిళా ఆరోగ్య కేంద్రాలను రాష్ట్ర స్థాయిలో ప్రారంభించుకుంటున్నాము. జనగామ జిల్లాలో 5 మహిళా ఆరోగ్య కేంద్రాలు పాలకుర్తి దేవరుప్పుల లింగాల ఘనపూర్ బచ్చనపేట ధర్మకంచ ప్రారంభించుటకు అనుమతి రాగా ఈ రోజు పి.హెచ్.సి పాలకుర్తిలో ప్రారంభించుకుంటున్నాము. ప్రతి మంగళవారం ఉమెన్ క్లినిక్‌లు అందుబాటులో ఉంటాయి.

ఈ క్లినిక్‌ల ద్వారా మహిళలకు ప్రత్యేకంగా టెస్టులు చేస్తారు. 57 రకాల పరీక్షలు చేసి చికిత్సతో పాటు ఉచిత మందులు అందిస్తారు. 8 ప్యాకేజీలు 12 రకాల పరీక్షలు, తక్షణమే మందులు అందజేయుట. క్యాన్సర్ బీపీ షుగర్ సెక్సువల్ ట్రాన్స్‌మిటెడ్ ఇన్ఫెక్షన్ పీసీవోడీ వెయిట్ మేనేజ్‌మెంట్ రుతుస్రావ మూత్రనాల ఇన్ఫెక్షన్ మధుమేహం రక్తపోటు రక్త హీనత ఓరల్, సర్వైకల్ రొమ్ము క్యాన్సర్ సూక్ష్మ పోషకాల లోపాలు నెలసరి సంతాన పరీక్షలతో పాటు పలు రకాల టెస్టులు చేస్తారు.కేవలం 24 గంటల్లోనే టెస్టు రిపోర్టులు రానుండగా ఇందుకోసం తెలంగాణ డయాగ్నస్టిక్ పోర్టల్‌లో ప్రత్యేక లింక్‌ను అందుబాటులో ఉంచనున్నారు. అన్ని వయస్సుల మహిళలకు ఉమెన్స్ ప్రత్యేక క్లినిక్‌లలో వైద్య సేవలు అందిస్తారు.

ఇందుకోసం ఉమెన్ క్లినిక్‌లలో ఉండే సిబ్బందికి ట్రైనింగ్‌లు ఇస్తున్నారు. అలాగే టెస్టు శాంపిల్స్ ను డయాగ్నస్టిక్ సెంటర్లకు తరలించేందుకు ప్రత్యేక వెహికల్స్ ఏర్పాటు చేస్తోన్నారు.క్లినిక్‌కు వచ్చిన మహిళల డీటైల్స్ యాప్‌లో అందుబాటులో ఉంటాయి. అలాగే ఆస్పత్రి రిఫరల్ లింక్స్ కూడా ఇందులో ఉంటాయి. మహిళ ఆస్పత్రిలో చేరిన తర్వాత ఎలాంటి వైద్య సేవలు అందుతాయనే వివరాలను కూడా సిబ్బంది తెలుసుకోనున్నారు. ఆసుపత్రి అధికారులు స్వయంగా మహిళల దగ్గరకు వెళ్లి వారి ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తారు.

అలాగే మహిళల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టింది. న్యూట్రిషన్ కిట్లను కూడా అందజేస్తున్నది ఆరోగ్యలక్ష్మి వంటి పథకాలను అమలు చేస్తున్నది. గతంలో ఎర్రబెల్లిటస్ట్ ఆధ్వర్యంలో అనేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందించడం జరిగింది. కాగా తమకు పోషకాహారం కింద కాకుండా రెగ్యులర్ వేతనాలు అందే విధంగా చూడాలని పలువురు ఆశా వర్కర్లు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కి ఈ సందర్భంగా వినతి పత్రాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ సుహాసిని జిల్లా వైద్యాధికారి ప్రశాంత్, డాక్టర్ రవి రాథోడ్, హాస్పటల్ సిబ్బంది, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, సర్పంచ్ వీరమనేని యకాంత రావు, ఎంపీటీసీ ఎడవెల్లి పురుషోత్తం మండల కో ఆప్షన్ మేంబర్ ఎండి సర్వర్ ఖాన్ స్థానిక ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు హాస్పిటల్స్ సిబ్బంది పలువురు మహిళలు తదితరులు పాల్గొన్నారు




## అంగన్వాడీ ఉద్యోగులను ప్రభుత్వం గుర్తించాలి

- పినపాక నియోజకవర్గ కన్వీనర్ డా. సంతోష్ కుమార్

**మణుగూరు, విశాల భారతి :** మణుగూరు మండల కేంద్రంలో అంగన్వాడీ టీచర్లు చేపట్టిన నిరవధిక సమ్మెకు మద్దతుగా టిపిసిసి సభ్యులు & పినపాక నియోజకవర్గం కన్వీనర్ డా. సంతోష్ కుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి కనీస గౌరవ వేతనం 26000/రూపాయలతో పాటు వారికి పెన్షన్, ఈఎస్ఐ, హెల్త్ కార్డ్, ఉద్యోగ భద్రత సౌకర్యాలు కల్పించాలని అన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు 10 లక్షలు హెల్పర్లకు 5 లక్షలు చెల్లించాలని, సీనియారిటీని బట్టి వేతనంలో వ్యత్యాసం ఉండాలని వారన్నారు. ఇంక్రిమెంట్ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు, అదేవిధంగా ఈ డిమాండ్స్ నీ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీకి ఈ విషయాన్ని తెలియజేసి రానున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అంగన్వాడీ ఉద్యోగులకు న్యాయం జరిగే విధంగా పోరాడుతానని అన్నారు. కార్యక్రమంలో మణుగూరు మండల అధ్యక్షులు పిరాకిని నవీన్, మణుగూరు టౌన్ అధ్యక్షులు బోనగిరి శివ, సైదులు, మహిళా మండల అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, కంపా రవి, తదితరులు పాల్గొన్నారు.



## దేవరుప్పులలో మహిళా ఆరోగ్య క్లినిక్‌ప్రారంభం

**దేవరుప్పుల, విశాల భారతి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మహిళా ఆరోగ్య క్లీనిక్ ను ప్రారంభించిన ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేశం గౌడ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల ఆరోగ్య సమస్యలను ప్రారంభంలోనే గుర్తించి వాటికి సకాలంలో వైద్యం అందించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ఈ కార్యక్రమాన్ని అమలు చేశారని మహిళలంతా ఈ సేవలను సద్వినియోగము చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డిగూడెం సర్పంచ్ బిల్లా అంజమ్మ యాదవ రెడ్డి మెడికల్ ఆఫీసర్ పూజ డాక్టర్ శ్రీలక్ష్మి సూపర్‌వైజర్ భాగ్యమ్మ సంపూర్ణ సంధ్య కవిత ఎఎన్ఎం లు వసంత సృజన భాగ్య హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్ రామ్మూర్తి ఆశా వర్కర్లు బీఆర్ఎస్ నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## బెలిదె శశిరేఖమ్మ జ్ఞాపకార్థం వాటర్ బాటిల్స్ పంపిణీ

**దేవరుప్పుల, విశాల భారతి:** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మండల కేంద్రానికి చెందిన బెలిదె శశిరేఖమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు బెలిదె శశిరేఖనర్సయ్య దంపతులు మంగళవారం విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులందరికీ లడ్డూలను పంచడంతో ఆనందంతో మురిసిపోతూ బెలిదె నర్సయ్య దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బెలిదె నర్సయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను ఆకలింపు చేసుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని క్రమశిక్షణను అలవర్చుకొని క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై విద్యాబుద్ధులు నేర్చుకోవాలని దాతలు అందించే సహాయం పొంది సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబటి అంజయ్య ఉపాధ్యాయులు ఉమారాణి ఉషారాణి ఐఇఆర్పి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగం లేదని యువకుడి బలవన్మరణం



**గరిడేపల్లి, విశాల భారతి :** ఉద్యోగం లేదని యువకుడు మానసిక ఆందోళనకు గురై ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో జరిగింది. స్థానిక ఎస్సై పి.వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గడ్డిపల్లి ఆవాస గ్రామమైన యర్రకుంట గ్రామానికి చెందిన కట్టా సందీప్(23) బీటెక్ పూర్తి చేసి గత కొన్నాళ్లుగా హైదరాబాద్ లో ప్రైవేట్ ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నాడు. ఎంత ప్రయత్నించినా ఉద్యోగం దొరకక పోవడంతో గత 20 రోజుల క్రితం తన సొంత గ్రామానికి వచ్చాడు. ఇంటి కి వచ్చినప్పటి నుంచి ఇంటి వద్ద కొంత ఆ సౌకర్యంగా ఉంటూ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇనుప రాడ్డు కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.మృతుని తల్లి కట్టా కాంతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తామని తెలిపారు.



## ఘనంగా శ్రీకృష్ణ పల్లకి ఉత్సవ ఊరేగింపు..

**భువనగిరి టౌన్, విశాల భారతి :** ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారి దివ్య ఆశీస్సులతో ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక త్రైత సిద్ధాంతం వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో భాగంగా మంగళవారం పల్లకి ఉత్సవ ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కృష్ణాష్టమి నుండి నేటి వరకు పందిరిలో పూజలు అందుకున్న శ్రీకృష్ణ భగవానులవారు ఈరోజు పల్లకిలో ముస్తాబై భక్తుల కోలాటాల మధ్యల ,సన్నాయిల తో , భగవద్గీత శ్లోకాలతో, జయ ద్వానాల మధ్యల భువనగిరి పురవీధుల గుండా స్వామివారి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. హిందూ జ్ఞాన వేదిక సభ్యులు మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో తెలిపిన రహస్యమైన విలువైన జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకొని బుద్ధికి జ్ఞాన తేజస్సు కలిగించుకొని ఆ కృష్ణ పరమాత్మ లోనికి ఐక్యం కావాలని ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో 35 వార్డ్ కౌన్సిలర్ తంగళ్ళపల్లి రవికుమార్ శ్రీవాణి, 19వ వార్డు కౌన్సిలర్ వడిచెర్ల కృష్ణ యాదవ్, 20 వాడు కౌన్సిలర్ పచ్చాల హేమలత జగన్ గారు, కౌన్సిలర్ తరిమికొండ వెంకటేష్ గారు, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి గారు, విశ్వ హిందూ పరిషత్ చామ రవీందర్, మరియు రాఘవేందర్, తోట భాను, మరియు రాష్ట్ర వ్యాప్తంగా వున్న ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు పాల్గొన్నారు.



## దివ్యాంగులపై చిన్నచూపు ఎందుకు?'

**మహబూబాబాద్/ కురవి, విశాల భారతి:** వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మోదులగూడెం గ్రామం పరిధిలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగినది. ఈ సమావేశంలో రథం సారయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథి జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాజా మాట్లాడుతూ.. బీసీలకు మైనార్టీలకు లక్ష రూపాయలు ఇచ్చినట్లు వికలాంగులకు కూడా ఇవ్వాలని గత ఆరు నెలలుగా అప్లై చేసుకుని నేటికీ నేటి వికలాంగులకు అందని దక్షిణమే వికలాంగుల పరిస్థితి తక్షణమే ఎలాంటి షరతులు లేకుండా వికలాంగులకు రుణం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిన్న కాక మొన్న బీసీలకు మైనార్టీలకు తల రుణం ఇచ్చారు. వికలాంగులకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రడం గౌరమ్మ, ముత్తినేని సీతయ్య, బత్తిని వెంకన్న, బి రవీందర్, హెల్తి మహేష్, సిరి గద్దె పద్మ, నేలమారి మనమ్మ, రాసాల వెంకన్న, కొప్పుల విజయలక్ష్మి, కందిపాటి సుభద్ర, సిరిగదె లక్ష్మయ్య, గుండ్ర ఉప్పలయ్య, అక్కినపల్లి యాకయ్య, కూరపాటి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## యాక్సిడెంట్‌లో చనిపోయిన స్టూడెంట్ల కుటుంబాలను ఆదుకోవాలి

- గాయపడిన స్టూడెంట్లకు మెరుగైన చికిత్స అందించాలి
- పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు బానోత్ దేవేందర్ డిమాండ్




**మహబూబాబాద్, విశాల భారతి:** సిద్దిపేట జిల్లా అనంతసాగర్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపి ప్రభుత్వం డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ లో పరీక్ష రాసి తిరిగి సిద్దిపేటకు ప్రైవేటు వాహనంలో వస్తున్న క్రమంలో విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో మరణించడం తీవ్ర విషాదకరం అన్నారు. ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారని, మిగితా ఎనిమిది మంది విద్యార్థులు తీవ్ర గాయాల పాలయ్యారన్నారు. విద్యార్థులకు పరీక్ష సెంటర్లను స్థానికంగా నిర్వహించాలని గతంలో అధికారుల దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లిన కూడా పట్టించుకోకుండా అధికారులు పక్క జిల్లాల్లో పరీక్ష సెంటర్లు వేయడం వల్లే ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సిద్దిపేట ఇందూర్ ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులు అయిన నితిన్, గ్రీష్మ, నమ్రత కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, గాయపడిన విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని డిమాండ్ చేశారు.

## ఇల్లందు'లో కాంగ్రెస్ గెలుపు ఖాయం



**మహబూబాబాద్ /బయ్యారం, విశాల భారతి:** బయ్యారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రేపు రాష్టంలో అధికారంలోకి రాబోయేది కాంగ్రెస్ పార్టీ అని ఇల్లందు నియిజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు కాయమని రాష్టంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతు కుటుంబాలలో చిరునవ్వు చూసే విధంగా రైతులకి 2లక్షల రూపాయలు రుణమాఫీ అందిస్తామని కౌలు రైతులకి ఎకరాకు 15 వేలు పెట్టుబడి సాయం అందించడం తో పాటు బి.ఆర్.ఎస్ రాష్ట్ర ప్రభుత్వం ధరణి పేరుతో ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్న భూములను లాక్కోవడమే కాక వారి జీవితాలతో చెలగాటం ఆడుకుంటుంది అని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ధరణి ఎత్తి వేసి పోడు, లావని, హక్కు పత్రాలను అందిస్తామని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత కరెంటు, ఏక కాలంలో రైతు రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కింది అన్నారు. కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలో పొందు పరచిన హామీలన్ని అమలు చేస్తామని అన్నారు. ఈ నెల 17 వ,తేదిన రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ లో రాజీవ్ గాంధీ ప్రాంగణంలో విజయబేరి భారీ బహిరంగ సభ సుమారు 10 లక్షల మంది తో నిర్వహించడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమానికి సి.డబ్ల్యూ.సి సభ్యులు కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు 39 మంది హాజరు కానున్నారు. ఈ బహిరంగ సభలో శ్రీమతి సోనియాగాంధీ 5 డిక్లరేషన్ ను ప్రకటించనున్నారు. ఈ బహిరంగ సభ ధ్వారా తెలంగాణ లో ఎన్నికల శంకారావం మోగించబోతున్నారు కావున బయ్యారం మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని సభని జయప్రదం చేయగలరని కోరారు.



## సోమేశ్వరాలయంలో సామూహిక కుంకుమార్చన

**పాలకుర్తి, విశాల భారతి:** పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణ మాస ఉత్సవంలో భాగంగా మంగళవారము స్వామివారికి సామూహిక కుంకుమ అర్చనలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. స్వామివారికి గవ్యాంత పూజలు, శ్రీ బాలగణపతి స్వామి వారికి విశేష అభిషేకములు దూర్వ (గరిక) పూజ గణపతి మూలమంత్రహవనము మరియు రుద్రహోమము బిల్వార్చన తులసి అర్చన నీరాజన మంత్రపుష్పములు తీర్థప్రసాద వితరణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భాగం లక్ష్మీప్రసన్న ఆలయ అర్చకులు ధర్మకర్తలు సిబ్బంది భక్తులు పాల్గొన్నారు

## సమస్యల వలయంలో 'మేకల తండా'





**తిరుమలపాలెం, విశాల భారతి:** తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పటు చేసి ప్రత్యేక ఫండ్స్ ఏర్పాటు చేసినప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉంటున్నాయి. వర్షం వచ్చిందంటే చాలు రోడ్లన్నీ బురదగా మారి నెలల తరబడి నీళ్లు నిల్వ ఉంటున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలాయపాలెం మండలం మేకల తండా గ్రామపంచాయతీ పరిధిలో కొన్ని బజార్లు చెరువును తలపిస్తున్నయి.వీధుల కలయిక వద్ద నెలల తరబడి నీళ్ళు నిల్వ ఉండి డెంగ్యూ, మలేరియా లాంటి భయంకరమైన వ్యాధులను కలిగించే బ్యాక్టీరియాకు నిలయంగా ఉంది. పాఠశాల రాకపోకలకు విద్యార్థులకు, వీధి నివాసులకు కష్టంగానే ఉంటుంది. అయినా సంబంధిత అధికారులు గ్రామ పంచాయతీల వైపు కన్నెత్తి చూడకపోవడంతో గ్రామ ప్రజలు పలుమార్లు కార్యదర్శి, సర్పంచులకు సమస్య చెప్పుకున్నప్పటికీ పెడచెవిన పెట్టి మనకెందుకులే అన్నట్టు లైట్ తీసుకుంటున్నారన్నారు. గత నాలుగేళ్లుగా వానకాలం వచ్చిందంటే బాధలు తప్పట్లేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నీరు నిలువ ఉండకుండా చూడాలని కోరుతున్నారు.

# మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి స్పెషల్ షో



నవీన్ పొలిశెట్టి. అనుష్క జంటగా నటించిన 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సినిమా రీసెంట్ గా ప్రేక్షకుల ముందుకొచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ సినిమా క్లీన్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా ప్రేక్షకుల అప్రిషియేషన్స్ తో పాటు చిత్ర పరిశ్రమలోని స్టార్ హీరోలు, హీరోయిన్స్, డైరెక్టర్స్, ప్రొడ్యూసర్స్ నుంచి ప్రశంసలు అందుకుంటోంది. తెలుగు రాష్ట్రాల్లో స్టడీ కలెక్షన్స్ సాధిస్తూ. ..యూఎస్ లో వన్ మిలియన్ మార్క్ అందుకుందీ సినిమా. తమ సినిమాను ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు, సినీ ప్రియులకు, ఇండస్ట్రీ సెలబ్రిటీస్ కు థాంక్స్ చెప్పింది హీరోయిన్ అనుష్క. ఈ గురువారం ఏపీ తెలంగాణలో లేడీస్ కోసం 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' స్పెషల్ షో ప్రదర్శించబోతున్నారు. ఈ నేపథ్యంలో హీరోయిన్ అనుష్క మాట్లాడుతూ - అందరికీ నమస్కారం. మా మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి సినిమాను ఇంతగా ఆదరిస్తున్నందుకు థాంక్స్. మీ మెసేజెస్, ట్వీట్స్, ప్రేమ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఈ గురువారం ఏపీ తెలంగాణలోని థియేటర్స్ లో లేడీస్ కోసం మా మూవీ స్పెషల్ షో ప్రదర్శిస్తున్నాం. మీ ఇంట్లో చిన్నవాళ్లను, పెద్ద వాళ్లను ఈ స్పెషల్ షోకు తీసుకువెళ్లండి. మీ రెస్పాన్స్ కోసం వేచి చూస్తుంటాను. అని చెప్పింది.



# మాస్ కా దాస్ విశ్వక్ సేన్ అతిథిగా రామన్న యూత్ ప్రీ రిలీజ్

టాలెంటెడ్ యంగ్ యాక్టర్ అభయ్ నవీన్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన సినిమా "రామన్న యూత్". ఎంటర్ టైనింగ్ పొలిటికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఫైర్ ఫ్లై ఆర్ట్స్ సంస్థ నిర్మించింది. "రామన్న యూత్" సినిమా ఈ నెల 15న విడుదలకు సిద్ధమవుతోంది. సోమవారం సాయంత్రం ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాస్ కా దాస్ విశ్వక్ సేన్, ప్రియదర్శి, తిరువీర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా .. హీరో, దర్శకుడు అభయ్ నవీన్ మాట్లాడుతూ ... సినిమా తీయాలనేది నా కల. నా పట్టుదల చూశాక ఫ్రెండ్స్, ఫ్యామిలీ ఎంతో సపోర్ట్ చేయడం ప్రారంభించారు. వీళ్లంతా నన్ను నమ్మకపోతే నేను సినిమా చేయగలిగే వాడిని కాదు. నా టీమ్ నాకు పెద్ద బలం. ముందు సినిమా చేయి అన్నా అనేంత సపోర్ట్ ఇచ్చారు. వారందిరికీ నా థాంక్స్ చెబుతున్నా. విశ్వక్ కు థాంక్స్ చెబుతున్నా. . ట్రైలర్ నచ్చితే అందరికీ షేర్ చేయండి. మా సినిమాను థియేటర్ లో చూసి ఎంకరేజ్ చేయండి. అన్నారు. హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ... - నా సినిమా ప్రదర్శించే థియేటర్ దగ్గరకు వెళ్లి టికెట్ మీద ఆ సినిమా పేరు చూడాలనుకునేవాడిని. సినిమాకు ఎంత బడ్జెట్ పెట్టామనేది చూస్తుంటారు చాలా మంది కానీ..ఆ సినిమా వెనక పనిచేస్తున్న వాళ్లు ఎంత టాలెంటెడ్ అనేది చూస్తే అది సినిమాకు అసలైన స్ట్రెంత్ అని నమ్ముతాను. రామన్న యూత్ కు అలాంటి మ్యాజిక్ వర్కవుట్ అవ్వాలని కోరుకుంటున్నా. ఈ సినిమాకు డైరెక్షన్ డిపార్ట్ మెంట్ లో కొంతమంది మహిళలు పనిచేశారని విన్నాను. అమ్మాయిలు ఇండస్ట్రీకి రండి. బాలీవుడ్ లో చాలా మంది వుమెన్ సినిమాకు వర్క్ చేస్తారు. మీరు సెట్ లో ఉంటే అబ్బాయిలకు మోటివేషన్ ఉంటుంది. తరుణ్ భాస్కర్ ఏడాదిన్నర క్రితమే ఈ కథ గురించి చెప్పాడు చాలా బాగుందని. చాలా ఇంట్రెస్టింగ్ పాయింట్ ఇది. హోల్ టీమ్ కు ఆల్ ది బెస్ట్ చెబుతున్నా. ఈ నెల 15న రామన్న యూత్ సినిమా చూడండి. మీకు తప్పకుండా నచ్చుతుంది. అన్నారు.

# అతిథి వెబ్ సిరీస్ లో మాయ క్యారెక్టర్ లో ఆకట్టుకుంటా

## : హీరోయిన్ అవంతిక మిశ్రా

మాయ, వైశాఖం, మీకు మాత్రమే చెప్తా వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన హీరోయిన్ అవంతిక మిశ్రా. ఆమె కీలక పాత్రలో నటిస్తున్నవెబ్ సిరీస్ "అతిథి". వేణు తొట్టెంపూడి హీరోగా నటిస్తున్న ఈ వెబ్ సిరీస్ డిస్నీ ప్లస్ హాట్ స్టార్ స్పెషల్స్ గా రాబోతోంది. "అతిథి" వెబ్ సిరీస్ ను రాండమ్ ఫ్రేమ్స్ ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్ పై దర్శకుడు భరత్ వైజీ రూపొందించారు. ప్రముఖ దర్శకుడు ప్రవీణ్ సత్తారు షో రన్నర్ గా వ్యవహరిస్తున్నారు. డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో ఈ నెల 19 నుంచి "అతిథి" స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో "అతిథి"లో నటించిన ఎక్స్‌పిరియన్స్ తెలిపింది అవంతిక మిశ్రా. నీలకంఠ గారి మాయ సినిమా ద్వారా నేను తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యాను. ఆ సినిమా తర్వాత నేను బెంగళూరులో పైలట్ కోర్స్ లో జాయిన్ అయ్యాను. వైశాఖం మూవీ తర్వాత తెలుగులో స్టార్స్ నటించిన రెండు మూడు చిత్రాల్లో ఆఫర్స్ వచ్చాయి. అయితే ఆ సినిమాలు లాక్ డౌన్ వల్ల ఆలస్యమవుతూ వచ్చాయి. కొన్ని ఆగిపోయాయి. దాంతో తెలుగులో కొంత గ్యాప్ వచ్చింది. నేను తమిళంలో రెగ్యులర్ గా మూవీస్ చేస్తున్నాను. నేను చేసిన కొన్ని తమిళ మూవీస్ చూసి "అతిథి"లో క్యారెక్టర్ కు కాంటాక్ట్ అయ్యారు. నాకు కెరీర్ లో విభిన్నమైన క్యారెక్టర్స్ ప్రయత్నించాలని ఉంటుంది. నేను తెలుగులోకి మళ్లీ వస్తున్నాను అన్నప్పుడు కొత్తగా కనిపించాలని అనుకున్నాను. అతిథిలో నాకు అలాంటి అవకాశం దొరికింది. ఎందుకంటే తెలుగులోనే నేను పరిచయం అయ్యాను. తెలుగు ప్రేక్షకుల మనసులో ప్లేస్ సంపాదించుకోవాలని నాకెప్పుడూ ఉంటుంది. నేను ఈ వెబ్ సిరీస్ లో మాయ అనే క్యారెక్టర్ చేశాను. మాయ ఒక అందమైన అమ్మాయిగా కనిపిస్తాను. ఆ తర్వాత దెయ్యంగా కనిపిస్తాను. ఆమె ఒక మిస్టీరియస్ వుమెన్. అయితే మీరు ట్రైలర్ చూసింది కొంత పర్సెంట్ మాత్రమే. నా క్యారెక్టర్ లో చాలా డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి.



# కోట బొమ్మాళి PS పాటను హమ్ చేస్తున్న హీరోయిన్ శ్రీలీల



తెలుగులో అనేక సినిమాలు నిర్మించి సూపర్ హిట్లు, బ్లాక్ బస్టర్లు అందుకుంది గీతా ఆర్ట్స్ 2 సంస్థ. GA2 పిక్చర్స్ బ్యానర్ ద్వారా భలే భలే మగాడివోయ్, గీత గోవిందం, టాక్సీవాలా, ప్రతి రోజు పండగే, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ లాంటి సినిమాలు నిర్మించగా కొన్ని ఇతర భాషలు సినిమాలను కూడా తెలుగులో రిలీజ్ చేసి సక్సెస్ లనుఅందుకున్నారు.తాజాగా మలయాళ సూపర్ హిట్ నాయాట్టు కి రీమేక్ గా కోట బొమ్మాళి పిఎస్ పేరుతో తెలుగులో విడుదల చేస్తున్నారు.ఈ సినిమాకి నిర్మాతలుగా బన్నీ వాస్, విద్యా కొప్పినీడి వ్యవహరిస్తున్నారు. శ్రీకాంత్ మేక ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాలో వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రత్యేక పాత్రలో నటిస్తోంది. రాహుల్ విజయ్, శివాని రాజశేఖర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన మోషన్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ఇప్పుడు కోట బొమ్మాళి PS మ్యూజిక్ ప్రమోషన్లను ప్రారంభించారు మేకర్స్. సోమవారం ఇందులోని మొదటి పాటను విడుదల చేశారు. ఇప్పటికే హుక్ స్టెప్ ద్వారా విడుదల చేసిన పాట ప్రోమోకు మంచి రెస్పాన్స్ వచ్చింది. లింగి లింగి లింగిడి అంటూ సాగిన శ్రీకాకుళం మాస్ జానపద పాటకు రేలారే ఫేమ్ పి.రఘు సాహిత్యం అందించడంతోపాటు స్వయంగా పాడిన తీరు అందర్నీ ఆకర్షిస్తుంది. ముకుందన్ పాటను కంపోజ్ చేయగా విజయ్ పోలకి అద్భుతమైన కొరియోగ్రఫీ అందించారు. కలర్ ఫుల్ సెట్లో రాహుల్ విజయ్ శివానితో కలిసి శ్రీకాంత్ చేసిన సింపుల్ డాన్స్ మూమెంట్స్ అందర్నీ ఆకట్టుకుంటున్నాయి. హీరోయిన్ శ్రీలీల విడుదల ఈ పాటకు యూత్ లో మంచి క్రేజ్ వస్తోంది. దీంతో సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి. జోహార్, అర్జున ఫాల్గుణ వంటి చిత్రాలతో దర్శకుడిగా గుర్తింపునందుకున్న తేజ మార్ని ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు.

# అక్టోబర్ 6 న 'రూల్స్ రంజన్'



సుప్రసిద్ధ నిర్మాత ఏ.ఎం. రత్నం సమర్పణలో స్టార్ లైట్ ఎంటర్టైన్మెంట్ పతాకంపై దివ్యాంగ్ లవానియా, మురళి కృష్ణ వేమూరి నిర్మిస్తున్న చిత్రం 'రూల్స్ రంజన్'. కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి రత్నం కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. రింకు కుక్రెజ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అమ్రిష్ గణేష్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన పాటలకు, ప్రచార చిత్రాల కు అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా విడుదల అయిన సినిమా ట్రైలర్ సగటు సినిమా ప్రేక్షకుడిని వినోదంలో ముంచెత్తింది. 'రూల్స్ రంజన్' నుంచి విడుదల అవుతున్న ప్రతీ ప్రచార చిత్రం సినిమా చూడాలనే ఆసక్తిని రెట్టింపు చేస్తోంది. అమ్రిష్ గణేష్ పాటలలోనే కాదు నేపథ్య సంగీతంలో కూడా తన మెరుగైన ప్రతిభ ను కనబరుస్తున్నారు. ప్రతి ఒక్కరూ సినిమా చూసి వినోదం లో తెలియాడాలనే ఉద్దేశ్యం, మరింత మందికి చేరువ కావాలనే సదుద్దేశ్యంతో పూర్తి స్థాయి వినోద భరితంగా రూపొందుతోన్న ఈ చిత్రం ను అక్టోబర్ 6 న థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు చిత్ర దర్శక, నిర్మాతలు తెలిపారు . ఈ మేరకు ఆకట్టుకునే నూతన ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది చిత్ర బృందం. చిత్ర కథ, దానికి అనుగుణంగా సాగే సన్నివేశాలు, వాటికి తగ్గట్లుగా సంభాషణలు, వీటన్నింటినీ స్థాయిని పెంచే రీతిలో నేపథ్య సంగీతం, సందర్భ శుద్ధి గా సాగే పాటలు ప్రేక్షకుడిని అమితంగా ఆకట్టుకుంటాయి అని అన్నారు నిర్మాతలు.



# నయన్ లక్కీగాళ్

నయనతార టాలీవుడ్..కోలీవుడ్ లో సాధించాల్సిందంతా సాధించేసింది. తెలుగులో అవకాశాలు వస్తున్నా చాలా సెలక్టివ్ గా చేస్తోంది. విఘ్నేష్ శివన్ ని వివాహం చేసుకున్న తర్వాత కోలీవుడ్ లో కూడా అంతే సెలక్టివ్ గా వెళ్తోంది. తాను చేసే ఏ సినిమా అయినా తన బ్రాండ్ ఉండేలా చూసుకుంటుంది. కమర్షియల్ చిత్రాలకంటే లేడీ ఓరియేంటెడ్ నాయికగా సత్తా చాటాలని చూస్తోంది. ఈ రెండు పరిశ్రమలో అమ్మడు ఆ రకంగా జర్నీ సాగిస్తుంది. ఈ నేపథ్యంలో నయనతార జర్నీ ఎలా ప్లాన్ చేస్తుంది? అన్నది ఆసక్తికరం. ఇటీవలే 'జవాన్' సినిమాతో హిందీలో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. జవాన్ తో బ్లాక్ బస్టర్ అందుకుంది. తొలి సినిమాతోనే ఓ రేంజ్ లో సత్తా చాటింది. షారుక్ సరసన తగ్గ నాయిక అని నిరూపించింది. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ రేంజ్ లో ఇప్పడక్కడ ప్రోజక్ట్ అవుతుంది. సాధారణంగా ఎంత హిట్ వచ్చినా తొలి సినిమాతో ఇలా ఫోకస్ అవ్వడం చిన్న విషయం కాదు. ఆ రకంగా నయనతార లక్కీ గాళ్. బాలీవుడ్ లో ఎంతో మంది హీరోయిన్లు ఉన్నా షారుక్ ఏరికోరి మరీ నయన్ దించారు. ఇక్కడే నయనతార సగం సక్సెస్ అయింది. అటుపై విజయంతో పరిపూర్ణం అయింది. అయితే అమ్మడు ఇప్పడు హిందీలో జర్నీ ఎలా ప్లాన్ చేస్తుంది? అన్నది చూడాలి. అక్కడ స్టార్ హీరోల సరసన అవకాశాలు వస్తే నటిస్తుందా? లేదా? లేక టాలీవుడ్..కోలీవుడ్ మాదిరి సెలక్టివ్ గా వెళ్తుందా? ఇలా ఎన్నో సందేహాలు తెరపైకి వస్తున్నాయి. అయితే హిందీ పరిశ్రమలో కాంపిటీషన్ మాత్రం ఈ రెండు పరిశ్రమల్లా ఉండదు. కరీనా కపూర్..కంగనా రనౌత్..కత్రినాకైఫ్..దీపికా పదుకొణే.. రాణీ ముఖర్జీ..జాక్వెలిన్ పెర్నాండేజ్ లాంటి తలపండిన నాయికలు ఎంతో మంది ఉన్నారు. అలాగే యువ నాయికలు అలియాభట్...జాన్వీ కపూర్ లాంటి ఫేమస్ బ్యూటీలు కొంత మంది ఉన్నారు. వాళ్లందరి పోటీని తట్టుకుని నయన్ నిలబడాల్సి ఉంటుంది. పైగా బాలీవుడ్ ఇండస్ట్రీ విధి విధానాలు వేరుగా ఉంటాయి. పూర్తిగా దర్శక-నిర్మాతలకు లోబడి పనిచేయా ల్సి ఉంటుంది. దక్షిణాది పరిశ్రమలో అది చేయను..ఇది చేయను అంటే కుదరదు. అక్కడ నుంచి నెగిటివిటీ అనేది చాలా వేగంగా స్ప్రెడ్ అవుతుంది. అక్కడ సక్సెస్ అవ్వాలంటే బాండ్ అయి ఉండాల్సిందే. మరి ఇలాంటి సవాళ్ల నడుమ నయన్ జర్నీ ఎలా సాగిస్తుందన్నది ఆసక్తికరం.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.